
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 26 డిసెంబరు 2024





వెస్ట్ ప్యారిస్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న యువత



నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థన చేస్తున్న బిషప్ జోహాన్ బాబూరావు



గుంటూరు : ప్రార్థనలో పాల్గొన్న యువతులు



తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు



ప్రార్థనలకు వచ్చిన భక్తులతో సందడిగా ఉన్న వెస్ట్ ప్యారిస్ చర్చి

సంబరంగా క్రిస్మస్

- భక్తులతో కిటకిటలాడిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ప్రముఖులు

గుంటూరు, డిసెంబరు 25: క్యాండిల్స్ వెలుగులు.. కేక్ కటింగ్‌లు.. క్రీస్తు సంగీత కార్యక్రమాలు.. పాస్టర్ల సందేశాలు.. భక్తుల కేరింతల మధ్య క్రిస్మస్ వేడుకలు సంబరంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచి క్రిస్మస్ సంబ రాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ సంబరాలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. క్రీస్తు ప్రబోధనలు ఆచరణీయమని భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరవడంతో చర్చిలు కిటకిటలాడాయి. చర్చిల్లో కేక్ కట్ చేసి క్రీస్తు జన్మదిన వేడుకలు జరుపుకు న్నారు. పలుగ్రామాల్లో గ్రామోత్సవాలు కూడా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, పూజలు, భక్తి గీతాలతో ఆలయాలు మార్మోగాయి. ఆయా ప్రార్థ నలు, పూజల్లో మత పెద్దలు, రాజకీయ నాయకు లు, ప్రజా ప్రతినిధులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఫిరంగిపురం, నరసరావుపేట, రావి పాడు, సత్తెనపల్లి, పాటిబండ్ల, తాళ్ల చెరువు, పాటిబండ్ల, అత్తలూరు, కనపర్రు, గురజాల, రెంటచింతల, మాచర్ల, నాగార్జున సాగర్, విను కొండ, పిడుగురాళ్ల, తెనాలి, దుగ్గిరాల, బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, మార్టూరు, చిలకలూ రిపేట, యడ్లపాడు, నాదెండ్ల, పొన్నూరు, చేబ్రో లు, పాతరెడ్డిపాలెం, ముట్లూరు, ప్రత్తిపాడు, పెద నందిపాడు, మంగళగిరి, తాడేపల్లి, పెదవడ్లపూడి, పెదపరిమి, తుళ్లూరు, తాడికొండ, అమరావతి, క్రోసూరు, అచ్చంపేటలతో పాటు పలు గ్రామాలు, మండల కేంద్రా ల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



అచ్చంపేట : తాళ్ళచెరువులోని బాల ఏసు దేవాలయంలో దివ్యబలి పూజ చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య (ఇన్‌సెట్లో) ఫిరంగిపురం చర్చిలో బాల ఏసుతో భాగ్యయ్య

ఆదర్శవంతంగా జీవించాలి : బిషప్ భాగ్యయ్య

అచ్చంపేట, ఫిరంగిపురం: క్రైస్తవులు ఇతరులకు ఆదర్శంగా జీవిస్తూ శాంతి సమాధానంతో మెలగాలని బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య తెలిపారు. బుధవారం అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరైన బిషప్ బాలఏసు దేవాలయం వద్ద దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన క్రిస్మస్ సందేశం ఇస్తూ ప్రతి క్రైస్తవుడు ప్రేమ తత్వంతో మెలిగి ఇతరులకు ఆదర్శవంతంగా ఉండటమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ ప్రపంచానికి ప్రేమ సందేశాన్ని అందించారన్నారు. ఉద యం జూబ్లీ విజయోత్సవ పతాక స్థూపం శంకుస్థాపన చేశారు. సాయంత్రం కొవ్వొ త్తుల ప్రదర్శన, తేరు ఊరేగింపు జరిగింది. ఫిరంగిపురంలోని బాలఏసు కథెడ్రల్ దేవా లయంలో క్రిస్మస్ జాగరణ సమిష్టి దివ్య పూజా బలి జరగ్గా బిషప్ భాగ్యయ్య పాల్గొన్నారు. దేవుడి కుమారుడైన జీసెస్ మనుష్య కుమా రుడిగా ఈ లోకంలో ఆదర్శవంతమైన జీవితాన్ని ఆచరించి అందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచార న్నారు. నీతి, నిజాయితీలతో ఉండాలని, అప్పుడే సమాజం శాంతి సమాధానాలతో విలసిల్లుతుం దన్నారు. తొలుత బిషప్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి, బాలఏసు స్వరూపాన్ని ముద్దాడారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని పంపిణీ చేశారు.



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ఫిరంగిపురం బాల ఏసు చర్చి


సాగు సంఘాలకు సవాళ్లు

సంఘాలదే బాధ్యత

సాగునీటి సంఘాలు నీటి సరఫరాలో కీలకం కానున్నాయి. నీటి సరఫరా సమస్యలపై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే. సంఘాలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటాయి. ఏ కాల్వపై సమస్య తలెత్తినా వెనువెంటనే అధికారుల కంటే ముందు సంఘాలు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడైనా కాల్వలకు గండి పడినా, కట్టలు పగిలిపోయినా.. నీటి పారుదలకు అవరోధాలు ఏర్పడినా వెంటనే సంఘాలు స్పందించి సమస్యలను పరిష్కరించాలి. మైనర్.. సబ్ మైనర్.. చిన్న చిన్న కాల్వలకు ఏ సమయంలో నీరు విడుదల చేయాలి, ఎప్పుడు నిలుపుదల చేయాలన్న అవగాహన సంఘాలదే. సంఘాలు పటిష్ఠంగా పనిచేస్తే నీటి కష్టాల నుంచి రైతులు గట్టెక్కే అవకాశం ఉంటుంది.



తెనాలి : పొన్నూరు మండల పరిధిలో కొమ్మమూరు కెనాల్‌పై కొట్టుకుపోయిన ఇసుక మూటలు




నిజాంపట్నం దగ్గర పంట కాల్వ కట్ట దుస్థితి

కాల్వలన్నీ శిథిలం

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాల్వలు శిథిలస్థితికి చేరుకున్నాయి. కాల్వల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. సాగునీటి కాల్వల నిండా జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు అల్లుకుపోయాయి. కాల్వల నిండా నాచు పెరుగుతున్నది. నీటి సరఫరాకు అవరోధంగా ఉంది. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు దెబ్బతిన్నాయి. మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. నీటి సరఫరాలో నియంత్రణ లేక నీరంతా వృథాగా పోతోంది. ఐదేళ్లు నిధుల లేక మరమ్మతులు జరగక కాల్వలన్నీ పాడుబడ్డాయి. తట్ట పూడిక తీసిన పాపాన పోలేదు. ఎన్నికలు నిర్వహించకుండా నీటి సరఫరాలో సాగు నీటి సంఘాల భాగస్వామ్యం లేకుండా చేయడంతో కాల్వల అధ్వానంగా మారాయి.

కాల్వలు శిథిలం.. సాగునీటి పారుదల వ్యవస్థ అధ్వానం.. ఐదేళ్లు... ఒక్క కాల్వపై మరమ్మ తులు చేసింది లేదు. కట్టలకు గండ్లు పడినా.. షట్టర్లు దెబ్బతిని నీరు వృథాగా పోతున్నా.. తూములు, కల్వర్టులు శిథిలమైపోయినా పాలకులకు పట్టలేదు. కాల్వల నిండా నీరున్నా చివరి భూములకు అందక రైతులు అల్లాడుతున్నారు.. పంటలకు ఊపిరిపోసే నీరంతా వృథా.. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి కోసం రైతులు అల్లాడిపోయారు. నీటి పారుదల వ్యవస్థను విస్మరించిన పాలకులు సాగునీటి సంఘాల ఎన్నికలను మరిచారు. దీంతో రైతులు సాగునీటి కష్టాలతో ఐదేళ్లు అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఇటీవలే ఎన్నికలు నిర్వహించింది. దీంతో రైతులు తమ కష్టాలు తీరినట్లేనని భావిస్తున్నారు. అయితే సాగునీటి సంఘాలకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించి రైతుల ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది.

- షట్టర్లు లేవు.. పూడికతీత మరిచారు
- ఐదేళ్లుగా కాల్వలకు పైసా విదల్చలేదు
- నీటి పారుదలపై గత పాలకుల నిర్లక్ష్యం
- కాల్వల నిండా నీరున్నా పంటల సాగు జాప్యం
- కాల్వల బాగుకు నీటి సంఘాలు నడుం కట్టాలి



పశ్చిమ కెనాల్‌పై ఇంటూరు దగ్గర శిథిలమైన పంటకాల్వ తూములు



గుర్రపు డెక్కతో నిండిపోయిన రేపల్లె మండలం ఉప్పూడి డ్రెయిన్



చిలకలూరి పేట మేజర్ కాలువలో పెరిగిన కంప

తెనాలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాల్వల ఎగువన పుష్కలంగా నీరున్నా చివరి భూములకు చుక్క నీరందింది లేదు. సాగునీరులేక రైతులు పొలాలను ఎడారిగా వదిలే శారంటే కాల్వల దుస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. ఐదేళ్లలో కాల్వల్లో పూడికతీత తీసిన దాఖలాలే లేవు. ఎక్కడా ఒక్క కరకట్ట పటిష్ఠతకు చర్యలు తీసుకున్న జాడే లేదు. పైగా వాగులు, వంకలను కూడా వదిలిపెట్ట కుండా మట్టి మాఫియా తయారై కట్టలను కూడా యథే చ్ఛగా లూటీ చేసిన ఘనత గత పాలకులది. సకాలంలో నీరందక వేల ఎకరాల్లో పంట ఎండిపోతున్నా చూస్తూ మౌనంగా రోధించాల్సిన స్థితినే అన్నదాత ఎదుర్కొన్నాడు. చిన్నపాటి వర్షాలకే మురుగు కాల్వలు పొంగి చేలను ముంచేసినా పట్టించుకున్న వారు లేరు. కాల్వల అత్యవ సర మరమ్మతుల కోసం ఐదేళ్లలో ఒక్క పైసా కూడా మంజూరు చేసిందేలేదు. రైతులు చెల్లించే నీటితీరువా మొత్తాలలో దామాషా ప్రకారం విడుదల చెయ్యాల్సిన నిధులనుకూడా ఇచ్చిందిలేదు. జలాశయాల్లో నీటి నిల్వలూ అంతంతమాత్రంగా ఉంటే, కనీసం పట్టిసీమ ను కూడా సరిగా వినియోగించుకోలేని అసమర్థత రైతు లపాలిట శాపంగా మారింది. ఆ ఐదేళ్ల పాపం ఇప్పుడు సాగునీటి సంఘాలకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుల ముందు సవాళ్లను నిలిపింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కొమ్మమూరు, పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలు, నిజాంపట్నం కాల్వల ద్వారా, వాటి పంటకాల్వల ద్వారా నీరందుతుంది. అయితే ప్రధాన కాల్వలే కాకుండా ప్రతి పంట కాల్వపైనా మరమ్మ తులు చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో సాగు నీటి సంఘాలకు ప్రతి కాల్వపైనా అజమాయిషీ ఉండేది. ప్రతి అడుగు వదలకుండా రైతులు కాల్వలపై ఇబ్బందు లను చెప్పేవారు కనుక మరమ్మతులు చేయడం కూడా తేలికయ్యేది. రైతులే పనులు

(మిగతా 6వ పేజీలో)

పనులు లేవు.. నిధులు మాయం

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి కాల్వల మరమ్మ తులను పూర్తిచేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత ఐదు సీజన్లుగా ఒక్కపని కూడా జరగలేదు. దీనికి కారణం.. నిధుల లేమి. అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతుల కోసం సాధారణ నిధులు, ప్రత్యేక మర మ్మతుల కోసం నిధులను ప్రభుత్వ విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓఅండ్ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీపోయి చివ రకు ఓఅండ్ఎం నిధులే దిక్కయ్యాయి. వాటిలో కూడా రూ.100 కోట్లకుపైగా ప్రతిపాదనలు పంపితే, రూ.15 నుంచి రూ.20 కోట్లలోపే మంజూరు చేశారు. ఆ నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్నప్పుడు కాకుండా, నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి పనులు చేసినట్లు చూపించారు. 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి దోచేశారన్న ఆరోపణలున్నాయి. వీటిపై రైతులు ప్రశ్నించినా, ఫిర్యాదు చేసినా వారిపై దౌర్జన్యాలు చేసిన సంఘటనలున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు రూ.22 కోట్లు ప్రభుత్వం ఓఅండ్ఎం కింద మంజూరు చేస్తే, తూటికాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం కాజేశారు.

పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి

- నేర నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలి
- పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్షణ కల్పిం చాలని స్టేషన్‌కు వచ్చే బాధితులకు తగిన గౌరవం ఇస్తూ వారి సమస్యను సావధానంగా ఆలకించి మేమున్నామని భరోసా నింపుతూ పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. డిజిటల్ అరెస్టు అని ఎవరైనా బెదిరిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి స్టాపర్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను పసిగట్టాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు ఉపక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నా రు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ జనార్ధన్‌రావుతో పలు విషయాలపై చర్చించి ఆదేశాలిచ్చారు.

మహిళా మీ కోసం..

వివిధ ప్రాంతాల నుంచి ప్ర యాణం చేసి రైల్వేస్టేషన్, బస్టాండ్లలో దిగి రాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడే మహిళల కోసం ప్రత్యే కంగా మహిళా మీ కోసం వాహనాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఆయా వాహనాల ద్వారా పోలీసులే భద్రంగా గమ్యస్థానాలకు దిగబెడతారన్నారు. మహిళా చట్టాలు, స్వీయ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తది తర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ జనార్ధనరావు, సీఐ శ్రీనివాసరావు

6

హాస్టళ్లలో భద్రత డొల్ల

- వసతి గృహాల్లో విద్యార్థినుల పర్యవేక్షణ శూన్యం

యువతి కిడ్నాప్‌కు యత్నం 6

- ఆటోలో నుంచి దూకి పరిగెత్తిన వైనం

అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా

● ఇన్‌చార్జ్ ఎంపీపీ జబీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీకి చెందిన తనకు అన్ని అర్హతలున్నప్పటికీ బీసీ ధ్రువీకరణ పత్రం అందించకపోవడంతో ఎంతో మానసిక వేదనకు గురయ్యానని ఇన్‌చార్జ్ ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మంగళవారం ఆన్‌లైన్ ద్వారా సచివాలయంలో బీసీ ధ్రువీకరణ పత్రం అందుకున్న జబీన్ బుధవారం చిలువూరులో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జబీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తనకు బీసీ ధ్రువీకరణపత్రం రాకుండా అడ్డుకున్నారనీ, రెవెన్యూ అధికారులు వత్తాసు పలికారని ఆరోపించారు. ధర్మం గెలిచింది, నిరీక్షణ ఫలించిందంటూ ఉద్వేగానికి గురయ్యారు. కోర్టు, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగాననీ, అన్యాయంగా బీసీ ధ్రువీకరణ పత్రాన్ని తిరస్కరించారని వివరించారు. మహిళవని అధైర్య పడాల్సిన అవసరమే లేదనీ, రానున్నది మన ప్రభుత్వమేననీ, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని నేటి మంత్రి నారా లోకేశ్ ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు. కూటమికి చెందిన ఎంపీటీసీ సభ్యులందరూ బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా తన వెంట నిలబడ్డారని, తనకు అండగా నిలిచిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు రోజ మరియమ్మ, తెదేపా గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, చిలువూరు శేషగిరిరావు, ఏసుపాదం పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్‌కు యత్నం

పొన్నూరుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువతిని ఆటోలో ఎక్కించుకున్న యువకులు కిడ్నాప్ చేయటానికి చేసిన ప్రయత్నం మంగళవారం రాత్రి విఫలమైంది. చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం తెనాలికి చెందిన 25 ఏళ్ల యువతి గుంటూరులో ప్రైవేటు సంస్థలో పని చేస్తుంది. మంగళవారం విధులు ముగించుకొని బుడంపాడు బైపాస్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఏపీ39యూఆర్ 7221 నంబరు కలిగిన ఆటో వచ్చింది. తెనాలి వెళ్తున్నామని చెప్పి యువతిని ఆటో ఎక్కించుకున్నారు. బుడంపాడు, నారాకోడూరు గ్రామాల మధ్య పంట పొలాల్లోకి ఆటోను మళ్లించారు. మద్యం మత్తు లో ఉన్న యువకుల నుంచి తప్పించుకోవడానికి యువతి ఆటోలో నుంచి దూకి మెయిన్ రోడుపైకి పరుగులు తీసింది. ఆటోలో నుంచి దూకటంతో యువతికి గాయాలయ్యాయి. యువతి కేకలు వేస్తూ పరుగులు పెడుతుండగా రహదారిపై వెళ్తున్న వారు ఆమెను ఆపి జరిగిన సంఘటనను తెలుసుకొని 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో నారాకోడూరులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై వెంకట కృష్ణ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని యువతి చెప్పిన ఆనవాళ్ల మేరకు ఆటో వెళ్లిన డొంక రోడ్డులోకి వెళ్లారు. పోలీసుల రాకను గుర్తించిన యువకులు ఆటోతో పారిపోయే ప్రయత్నం చేశారు. అదే సమయంలో వర్షం కురుస్తుండటంతో పోలీసులు సినీఫక్కీలో ఆటోను, యువకులను పట్టుకునేందుకు పరుగులు తీశారు. పంట పొలాల నుంచి డొంక రోడ్లలో ఈ చేజ్ సాగింది. ఐదు కిలోమీటర్ల మీర వెంబడించిన పోలీసులు హెచ్చరికలు జారీ చేయగా యువకులు ఆటోను వదిలి పరారయ్యారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలో భద్రత డొల్ల

● విద్యార్థినుల హాస్టళ్లపై పర్యవేక్షణ శూన్యం
● వరుస సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్

గుంటూరు(విద్య), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఒక కళాశాల హాస్టల్‌లో విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసినా చర్యలు శూన్యం. సాక్షాత్తు నగర కమిషనర్ క్యాంపు కార్యాలయం పక్కన, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐజీ నివాసం ఉండే రోడ్డులోని హాస్టల్‌లో ఓ విద్యార్థి గర్భం దాల్చిన విషయం హాస్టల్ వార్డెన్, సంబంధిత అధికారులకు తెలియకపోవడం ప్రభుత్వ కళాశాల హాస్టళ్ల భద్రత డొల్లను బహిర్గతం చేస్తుంది.

పర్యవేక్షణ శూన్యం..

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆధ్వర్యంలో కళాశాల హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు విద్యను అభ్యసించే విద్యార్థినులు అక్కడ వసతి పొందుతూ సమీపంలోని కళాశాలల్లో చదువుకుంటూ ఉంటారు. అయితే విద్యార్థినుల హాస్టళ్ల పర్యవేక్షణను ఇటు వార్డెన్లు, అటు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్ర వచ్చి భోజనానికి అవసరమైన సరుకులు ఇచ్చి వెళ్లడం తప్పా, మిగతా విషయాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కనీసం నెలకు ఒకసారైన హాస్టళ్ల తనిఖీలు నిర్వహించడం లేదు. ఫలితంగా వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న విద్యార్థినుల కళాశాల హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ భద్రత విషయాలను పూర్తిగా పట్టించుకోవడం లేదు. నగరంలో కలెక్టర్ బంగ్లా రోడ్డు, అరండల్‌పేట, జూట్‌మిల్లు సమీపంలో, పట్టాభిపురం, పొన్నూరు రోడ్డు, చౌత్రా తదితర ప్రాంతాల్లో విద్యార్థినులకు కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. వార్డెన్లలో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. పర్యవేక్షణ బాధ్యతల్ని వంట మనుషులు, కమాటీలకు అప్పగించడంతో హాస్టళ్లలో ఏం జరుగుతుంతో తెలియని దుస్థితి. జిల్లా స్థాయి అధికారులతోపాటు సంబంధిత శాఖల ఏఎస్‌డబ్ల్యూవోలు కూడా పర్యవేక్షణ చేయడం లేదు.

● నాలుగు నెలల క్రితం నగరంపాలెంలోని స్టాల్ స్కూల్ ఆవరణలో ఉన్న కళాశాల హాస్టల్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. హాస్టల్‌లో పనిచేసే సిబ్బందే మధ్యవర్తులుగా ఉండి వేధింపుల్ని ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో లైంగిక వేధింపుల్ని ప్రోత్సహించిన సిబ్బంది, వేధింపులకు పాల్పడిన వారిపై నామమాత్రపు చర్యలు తీసుకుని వదిలేశారు.

● మూడు నెలల క్రితం జూట్‌మిల్లుకు సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల్ని వైసీపీ సానుభూతి పరులు కిడ్నాప్ చేసి అడివితక్కెళ్ళపాడులోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో బంధించడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. కిడ్నాప్‌కు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోలేదు. అక్కడ పనిచేసే వార్డెన్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి విషయాని వదిలేశారు.

● తాజాగా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్‌లో బీఫార్మసీ విద్యార్థిని గర్భం దాల్చింది. విద్యార్థిని హాస్టలోనే ఉంటున్నా, అక్కడి సిబ్బంది గానీ, వార్డెన్ గానీ గమనించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. సమీప బంధువు వల్ల గర్భం దాల్చినట్లు నివేదిక ఇచ్చిన అధికారులు లోతైన విచారణ చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి.

● కళాశాల హాస్టళ్ల సమీపంలో ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి. కనీసం హాస్టల్ వార్డెన్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ కళాశాల హాస్టళ్లలో విద్యార్థిల్ని చేర్పించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురికావాల్సి వస్తుంది.

ఈనామ్‌పై అవగాహన ఏదీ?

● డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధార పడుతున్న అధికారులు



గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈనామ్) విధానం గుంటూరు మిర్చియార్డులో అమల్లోకి వచ్చి ఏడేళ్లు పూర్తి అయినా దానికి సంబంధించి మార్కెటింగ్ అధికారులకు నామమాత్రంగా కూడా పరిజ్ఞానం లేదు. ఏ చిన్న విషయమైనా డేటా ఎంట్రీ ఆపరేటర్ల మీద ఆధార పడుతున్నారు. ప్రాథమిక అంశాలైన లాట్ ఐడీలను జనరేట్ చేయడం, బిడ్డింగ్ విధానం, సేల్ అగ్రిమెంట్ వంటివి కూడా తెలియవు. గత రెండు, మూడు నెలల నుంచి మిర్చియార్డులో అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తుతోండటం, రూ. 346 కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదిక అందజేయడంతో మార్కెట్ కమిషనర్ విజయ సునీత ఈనామ్ లోపాలపై అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అయితే అసలు ఈనామ్‌పై అధికారులకే అవగాహన లేకపోవడంతో ఏ విధంగా నివేదిక ఇస్తారోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. గుంటూరు మిర్చియార్డులో ఈనామ్ విధానం 2017 అక్టోబరు 9వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది, కమీషన్ ఏజెంట్‌లు, ఎక్స్‌పోర్టర్లు, వేమెన్‌లు ఎప్పటికప్పుడు వారి పనిని నెరవేరిస్తే ఈనామ్‌ను ఆన్‌లైన్‌లోనే నిర్వహించవచ్చు. అయితే ఎవరికి వారు తీరిక కుదిరినప్పుడు ఎంట్రీ చేస్తుండటంతో ఈనామ్ లక్ష్యం, ఉద్దేశం నీరుగారిపోతుంది. లోపాలను సరి చేసేందుకు ఎవరూ దృష్టి సారించడం లేదు. కాగా ఈనామ్ విధానంపై మార్కెటింగ్ అధికారులకు ముందుగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది.

సాగు సంఘాలకు.. సవాళ్లు

(5వ పేజీ తరువాయి)

చేయించుకుంటారు కనుక నిధుల దుర్వినియోగం విషయం అటుంచితే, ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేది. డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు కాల్వపై రూ.400 కోట్ల విలువైన పనులు జరగనేలేదు. ఆ నిధులు అప్పట్లో మురిగిపోయాయి. అయితే తర్వాత కాల్వ కట్టలు చిద్రమైపోయి గండ్లు పడటం, పంటలు దెబ్బతినటం షరామామూలైంది. బాపట్ల ప్రాంతంలో భారీ గండిపడినప్పుడు ప్రభుత్వం నిధులు సరిపడా ఇవ్వలేకపోవడం, పనులు సరిగా జరగక ఏటా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. గండ్లు పడ్డాక పూడ్చడానికి మళ్లీ నిధులు కేటాయించి వాటినీ గత ప్రభుత్వంలో వైసీపీ నేతలే జేబుల్లో వేసుకునే పరిస్థితి. దీంతో రైతులకు ఐదేళ్లు కడ'గండ్లు' మాత్రం తప్పలేదు. నాగార్జున సాగర్ జవహర్ కుడి కాలువ 203 కిలోమీటర్లు పొడవున పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో విస్తరించింది. 11,11,410 ఎకరాలకు సాగు నీటిని అందిస్తోంది. అనేక బ్రాంచ్.. మేజర్.. మైనర్ కాల్వల ద్వారా 11,000 క్యూసెక్కుల నీరు సరఫరా చేసే సామర్థ్యం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సాగర్ కాల్వ పరిధిలో కూడా చివరి భూములకు సాగునీరు అందక రైతులు అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాలు ఎంతో బాధ్యతతో రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ చివరి భూమి వరకు నీరు అందించే బృహత్తర కార్యక్రమం సంఘాలపై ఉంది. వైసీపీ హయాంలో నిర్వీర్యం అయిన సాగు నీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయాలి. అప్పుడే ప్రభుత్వ ఏర్పాటు చేసిన నీటి సంఘాల లక్ష్యాలు నెరవేరుతాయి. సాగునీటి సంఘాల ద్వారా రైతులే కాల్వలను కాపాడుకునేలా నిధులు ఖర్చు చేసుకునే స్వేచ్ఛ వచ్చింది. తమ ముందున్న పనుల్లో ఏవి అత్యవసరమో! నిర్ణయించుకుని ప్రతి పైసాను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు కూడా వచ్చింది. అయితే సంఘాల అధ్యక్షులు కూడా తమ ముందున్న సవాళ్లను అధికమించేందుకు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి వృధాను అరికట్టేందుకు కాల్వలకు షట్టర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది. కాల్వల మరమ్మతుల్లో షట్టర్లకు ప్రాధాన్యం కల్పించాల్సి ఉంది. పూడిక తీతకు కాల్వలు నోచుకోవడంలేదు. కట్టలు దెబ్బతిన్నాయి. దీంతో నీరు ఊటరూపంలో వృథా అవుతున్నది.

తీరువా వసూలు.. నిర్వహణ మరిచారు

సాగునీటి కాల్వల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గాలికొదిలేసింది. కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తిరువా చెల్లిస్తారు. సాగు నీటి సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా కమిటీల వారీగా కేటాయించాలి.

80 శాతం కేటాయించాలి

వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు గత ఐదేళ్లుగా జరగలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ 20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై ఈ నిధులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వ ఖజానాకు జమ చేసుకోవడంతో కాల్వల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. తీరువా నిధులు మరమ్మతులకు కేటాయించి ఉంటే కాల్వలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు.

పెనుగొండ 'దీపిక' తెలుగు సాహిత్యానికి కర దీపిక



పెనుగొండ లక్ష్మీనారాయణను శాలువాతో అభినందిస్తున్న సీపీఐ నేత ముప్పాళ్ల, డాక్టర్ భూసురుపల్లి

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సామాజిక జీవితంలోనూ పెనుగొండ కల్తీ లేని ప్రజాస్వామ్య లౌకిక అభ్యుదయ వాది అని, ఆయన దీపిక పుస్తకం తెలుగు సాహిత్య కర దీపిక అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు ప్రశంసించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ కవి, విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లకుపైగా తాను నమ్మిన 'అరసం'లో కొనసాగుతూ కార్యకర్తగా, నాయకుడిగా, రచయితగా పెనుగొండ కృషి చేస్తున్నారన్నారు. అభ్యుదయ సాహిత్య విమర్శకులైన ఆయన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష పదవి చేపట్టిన తొలి తెలుగు రచయిత అని, పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు అని అభినందించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెనుగొండ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవ్వటంతోనే ఏనాడో ఖ్యాతి వచ్చిందని, నేడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో ఆయన ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. పెనుగొండ తన సాహిత్య ప్రస్థానంతో రెండు, మూడు తరాలను ప్రభావితం చేశారన్నారు. పెనుగొండ తన యావత్ జీవిత కాలాన్ని అరసంకి, సాహిత్య రంగానికి అంకితం చేశారంటే అతిశయోక్తి కాదన్నారు. సత్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను కమ్యూనిజాన్ని విశ్వసిస్తానని, తన మార్గం కమ్యూనిజమని, కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలపడాలని కోరుకుంటున్నానని అన్నారు. సాహిత్యం, సాంస్కృతిక రంగంలో మార్పులు రావాల్సి ఉందన్నారు. తెలుగు నాట సాంస్కృతిక పునరుజ్జీవనానికి అరసం, విరసం వంటి సంస్థలు చేసిన కృషి ఫలితంగా బలమైన అభ్యుదయ సాహిత్య పునాదులు పడ్డాయన్నారు. వాటిని నేటితరం మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా సాహిత్య రచనలు చేస్తూ మరుగునపడిన సాహిత్యాన్ని వెలుగులోకి తేవటంలో విశేష కృషి చేసిన పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభ్యుదయ సాహిత్యానికి మరింత విలువను పెంచుతుందన్నారు. అగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తనకు పెనుగొండకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని, అవగాహనకు పెనుగొండకు ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించారు. అలానే రైతు నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు గ్రంథాల రచయిత జొన్నలగడ్డ రామారావు, ఆలోకం పెద్దబ్బాయి పెనుగొండ సాహితీ కృషిని అభినందించారు.

భారతదేశం సర్వమత సమ్మేళనం

● చినజీయర్ స్వామి



భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేస్తున్న చినజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సర్వమత సమ్మేళనమని, ఎన్నో తరాలుగా భేదాభిప్రాయాలు లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్నారని, భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండాలని త్రిదండి చినజీయర్ స్వామి ఆకాంక్షించారు. మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం చినజీయర్ స్వామి పదో పాశురాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి మంగళ శాసనాలను అందించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా యావత్ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ, నరసరావుపేట, మచిలీపట్నం ప్రాంతాల నుంచి వచ్చిన 280 మంది భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, సంకీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవానికి ప్రయత్నాలు

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. ఈ నెల 28న జరగాల్సిన ఎన్నికలను ఎలాగైనా ఏకగ్రీవం చేయాలని కొందరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత చాంబర్ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు రంగంలోకి దిగారు. చర్చలు నడుపుతున్నట్లు సమాచారం. ప్రతి ఏటా జరిగే చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు ఈ దఫా మరింత రసవత్తరంగా మారాయి. చాంబర్ అధ్యక్షుడుగా సుదీర్ఘకాలంగా వ్యవహరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులకు పోటీగా చాంబర్ కార్యదర్శిగా సుదీర్ఘకాలంగా కొనసాగిన రంగా బాలకృష్ణ గత ఏడాది ఎన్నికల బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవి చూశారు. ఈ దఫా ఎలాగైనా చాంబర్ అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రంగా బాలకృష్ణ ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చాంబర్‌కు సంబంధించిన పలువురు పెద్దలను కలవటమే కాక సభ్యులతో ఆత్మీయ సమావేశాలు పెడుతూ మద్దతు కూడగడుతున్నారు. కాగా చాంబర్ అధ్యక్ష పదవి పోటీ నుంచి ఈ దఫా వైదొలిగిన ఆతుకూరి ఆంజనేయులు స్థానంలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలో నిలిచారు. యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ ఇద్దరూ పోటీ పోటాగా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వ్యాపార వర్గాలతో యేల్చూరి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఈ నెల 23న నామినేషన్‌ల ఉపసంహరణ గడువు కూడా పూర్తయింది. ఈ నెల 26న తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. నామినేషన్‌లను ఉపసంహరించుకోకపోవటంతో ఎన్నికలు తప్పవని చాంబర్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈనెల 26న తుది జాబితా ప్రకటన వరకు సమయం ఉంటుందనీ, అప్పటి లోగా ఏకగ్రీవానికి ప్రయత్నాలు జరుగుతాయని చెబుతున్నారు. మొత్తానికి చాంబర్ ఎన్నికలు ఈ దఫా రసవత్తరంగా మారాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా 28న చాంబర్ ఎన్నికలు తప్పదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

రైలు నుంచి జారి కృష్ణాజిల్లా వాసి మృతి

తెనాలి క్రైమ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బుధవారం తెలిపారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మల్యాద్రి తెలిపిన వివరాల మేరకు.. తెనాలి - రేపల్లె రైలు మార్గంలోని వేమూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం రైల్వే ట్రాక్ వద్ద పడి ఉందన్న సమాచారంతో వెళ్లి పరిశీలించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు కృష్ణా జిల్లా ఎదురుమొండి గ్రామానికి చెందిన కొల్లూరు రఘురాంబాబు (27)గా గుర్తించారు. రేపల్లె వైపు వెళ్లే ట్రైన్ నుంచి జారి పడి మృతి చెందగా దీనిపై కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 575.20 అడుగులు ఉంది. ఇది 269.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8793 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16716, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,489 విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంజనేయస్వామి సేవలో హైకోర్టు జడ్జి

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానాన్ని బుధవారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రతాపవెంకటజ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో సుభద్ర, అర్చకులు జడ్జి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం స్వామి వారిని దర్శించి ప్రత్యేకపూజలు జరిపించారు.


ట్రినిటి పారిస్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

క్రీస్తు సర్వమానవాళికి రక్షకుడు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు ప్రభువు సర్వ మానవాళికి రక్షకుడని మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి అన్నారు. స్థానిక కొత్తపేటలోని ట్రినిటి పారిస్ చర్చిలో జరిగిన ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎజ్రా, దైవాశీర్వాదం, రమేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ ఘటనపై కేసు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవాపురం రెండో లైన్ లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఊట్ల ఈశ్వర ప్రసాద్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో పనిచేస్తుంటాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. మర్నాడు ఉదయం తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఈశ్వర ప్రసాద్ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు - నల్లపాడు రైల్వేస్టేషన్ల మధ్య నగరంలోని బ్రాడీ పేట 4/14కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని భావిస్తున్నారు. రైలు నుంచి జారిపడ్డాడా లేదంటే మృతికి వేరే కారణాలేమైనా ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది. మృతుని వద్ద కంభం నుంచి గుంటూరు వచ్చిన రైల్ టికెట్ లభ్యమైంది. దీంతో మృతుడు ప్రకాశం వాసి అయి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు రైల్వే సీఐ అంజిబాబుకు 94406 27546లో గానీ, హెడ్‌కానిస్టేబుల్‌కు 94407 90522లో గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.

శ్రీనగర్‌లో వ్యక్తి అదృశ్యం


దుండి వెంకటరెడ్డి

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీనగర్ కి చెందిన దుండి వెంకటరెడ్డి అదృశ్యమయ్యాడు. వెంకటరెడ్డి (58) అనే వ్యక్తి కూలి పనులు చేసి జీవిస్తుంటాడు. ముగ్గురు కుమార్తెలకు పెళ్ళిళ్ల చేశాడు. ఈ నెల 21న మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. అతని భార్య దుండి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోరంట్ల మల్లికార్జునపురానికి చెందిన మహిళ శ్వేత (39) ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వైజాగ్ గీతమ్స్ కాలేజీలో చదువుతున్న సమయంలో ఆమెకు డోకల శ్రీరామ్ వీరేష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇరువురు ప్రేమించుకొని 2015లో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత వారి మధ్య మన స్పర్థలు వచ్చాయి. వరకట్నం కోసం భర్త వేధిస్తుండటంతో రెండున్నరేళ్ల క్రితం శ్వేత పుట్టింటికి వచ్చింది. భర్త దూరమై మనస్తాపానికి గురైన శ్వేత ఈ నెల 19న ఫ్లోర్ క్లీనర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఆమె తండ్రి రజనీకాంత్ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి వ్యాపారిని బెదిరించిన ఘటనపై కేసు

ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మిర్చి వ్యాపారి శేఖర్‌బాబు వద్ద దేవపురం రెండో లైన్ కి చెందిన మిర్చి వ్యాపారి బర్మా వెంకట్రావు రూ.40 లక్షలు అప్పుగా తీసుకొని అందుకుగాను 195 చదువుల స్థలాన్ని ష్యూరిటీగా పెట్టాడు. కొంతకాలంగా డబ్బులు అడుగుతుంటే బర్మా వెంకట్రావు నుంచి స్పందన లేదు. దీంతో ఈ నెల 22న శేఖర్ బాబు దేవాపురంలోని వెంకటరావు ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా, ఆయనను దూషించి, బెదిరింపులకు పాల్పడ్డాడు. డబ్బులు తీసుకొని మోసం చేయడమేగాక తిరిగి తన ఇవ్వమన్నందుకు బెదిరించి దూషించిన వెంకట్రావుపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు హాజరు కాకుండా ఉండే అవకాశమే వెకేషన్

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వెకేషన్‌శాఖల ఉద్యోగుల సెలవు నియమావళి గురించి పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో వివరించారు. వెకేషన్ అంటే ఉద్యోగి సర్వీసులు క్రమం తప్పకుండా వచ్చు వెకేషన్‌లో ఉద్యోగి విధులకు హాజరుకాకుండా ఉండే అవకాశాన్ని మనం వెకేషన్‌గా భావిస్తామన్నారు. ఒక ఉద్యోగి వెకేషన్‌శాఖలోను, వెకేషన్‌శాఖ గాని వేరే శాఖలో రెండింటిలో పనిచేసేటప్పుడు వెకేషన్ శాఖలో పనిచేస్తున్నట్లు పరిగణించరాదన్నారు. 15 రోజులకు మించిన ప్రభుత్వ శెలవులనే వెకేషన్‌గా భావించాలన్నారు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్ వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన చర్చిలు
● ప్రత్యేక ప్రార్థనల్లో అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్యే నసీర్‌కు బహుమతి ఇస్తున్న క్రైస్తవ ప్రముఖులు, పాస్టర్లు

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జీవితం, బోధనలు అందరికీ ఆదర్శమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా స్థానిక లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చిలో క్రైస్తవులతో కలిసి బుధవారం ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో అందరి జీవితాలు సుఖశాంతులతో పరిఢవిల్లుతాయని అన్నారు.

క్రీస్తు సందేశం మార్గదర్శకం: ఎమ్మెల్యే నసీర్

క్రీస్తు సందేశం యావత్ ప్రజానీకానికి మార్గదర్శకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. నియోజకవర్గంలోని పలు చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి సందేశాన్ని అందరికీ చేరుస్తూ కొత్త ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు.

పలు చర్చిలలో ప్రార్థనలు

స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ చిన్నయ్య ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. స్థానిక రింగ్ రోడ్డులోని నిత్య సహాయ మాత ఆలయంలో ఫాదర్ లూయిస్, స్తంభాలగరువులోని ఆగ్జిలియం స్కూల్‌లోని దివ్య బాలయేసు దేవాలయంలో ఫాదర్ పుట్టి సుందరరాజు, నగరంపాలెంలోని పునీత అంతోనివారి దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ నరిశెట్టి బాలశౌరి, అమరావతి రోడ్డులోని వేళంగిణి మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ ఇన్నారెడ్డి, బొంగరాలబీడులోని లూర్దుమాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ అబ్రహం, కాకానిరోడ్డులోని మంగళదాస్‌నగర్‌లోని లూర్దుమాత ఆలయంలో ఫాదర్ కసిరెడ్డి జోసఫ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆయా చర్చిలకు భక్తులు హాజరయ్యారు.

ఏఈఎల్‌సీ చర్చిలలో ..

నగరంలోని ఏఈఎల్‌సీ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చిలో రెవరెండ్ ఎస్‌జె బాబూరావు, రెవరెండ్, జేమ్స్ సుధీర్, ఎం శ్యామ్యూల్‌జాన్, సిహెచ్ పురుషోత్తం చౌదరి, కిరణ్ కుమార్, మధుబాబు, కే షాలేమ్‌లు ఆయాచోట్ల ప్రార్థనలు నిర్వహించారు. హిందూ కళాశాల వెనుక ఉన్న వెస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు సతీష్, మాణిక్యారావు, యువరాజ్, సెంట్రల్ గుంటూరు సెనెడ్ బిషప్ టీ శాంతారావులు క్రిస్మస్ సందేశం ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతబస్టాండ్ వద్ద ఉన్న ఈస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు డీ చక్రధర్, ఆదాం, బీ విక్టర్, ప్రేమ్‌సాగర్ అర్ధరాత్రి ప్రార్థనలు చేశారు. ఏటీ అగ్రహారంలోని సౌత్ ప్యారిస్ చర్చిలో జీ సురేష్‌బాబు క్రిస్మస్ సందేశం ఇచ్చి ప్రార్థనలు నిర్వహించారు. కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలోని ట్రినిటి ప్యారిస్‌లో జె దైవాశీర్వాదం, రమేష్, బి లెనిన్ , మాన్యం చర్చిలో పాస్టర్ గొట్టిపాటి భాస్కర్‌రావు ఆయా ప్రార్థనల్లో పాల్గొన్నారు.


తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి


ఏసుక్రీస్తు గీతాలాపన చేస్తున్న మహిళలు




హిందూ కాలేజీ సెంటరులోని వెస్ట్ ప్యారిస్ చర్చిలో క్యాండిల్స్ వెలిగిస్తున్న యువతులు, చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ చక్రధర్‌రావు

ఎమ్మెల్యే ఆనందబాబును కలిసిన తెలుగు తమ్ముళ్లు


వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ నేతలు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబుకు పలువురు తెలుగు తమ్ముళ్లు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ నేతృత్వంలో పలువురు బీసీ నేతలు బుధవారం ఆయనను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆనంద బాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ నేతలు కసుకుర్తి హనుమంతరావు, మేక పోతుల సోమశేఖర్, పాటిబండ్ల బలరాం, గట్టి శ్రీనివాసరావు, గొడుగు శంకర్, పోపూరి నరేంద్ర, జాన్ సైదా, రుస్తుంబాబు, నల్లినేని శ్రీధర్‌లు తెలియజేశారు.


ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బుజ్జి


వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, బీజేపీ నాయకుడు ఉమాశంకర్

భరతమాత ముద్దుబిడ్డ వాజ్‌పేయి: ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భరతమాత ముద్దుబిడ్డ అటల్ బిహారీ వాజ్‌పేయి అని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి కొనియాడారు. మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో భాగంగా బుధ వారం స్థానిక నాజ్ సెంటర్‌లో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ శనక్కాయల అరుణ, తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వాజ్‌పేయి విగ్రహాన్ని ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ భారతదేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. గళ్లా మాధవి మాట్లాడుతూ ఒక సమర్థవంతమైన కూటమిని ఏర్పాటుచేసి ఎంతోమంది నాయకులకు వాజ్‌పేయి దిక్సూచిగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ రాజకీయాల్లో సమూలమైన మార్పులు తీసుకు వచ్చిన మహనీయుడు వాజ్‌పేయి అని కొనియాడారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాజ్‌పేయి అడుగుజాడల్లో ప్రధానమంత్రి మోదీ పని చేస్తూ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దారని అన్నారు. కార్య క్రమంలో ఆరో మండల అధ్యక్షుడు సురేష్ కుమార్ జైన్, జిల్లా సంయోజక్ బీ.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, చుండూరు ఉమామహేశ్వరావు, జంధ్యాల రామలింగ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో 27న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కామర్స్ విద్యారంగంలో ఇరవై రెండేళ్ల అనుభవం గల మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్లు డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. జాబ్‌మేళాలో ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జులు, క్లాస్ ఇన్‌చార్జిలు, హాస్టల్ స్టాఫ్, అకౌంటెంట్లు, కం ప్యూటర్ ఆపరేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్లు, డ్రైవరు పోస్టులకు ఉద్యోగావకాశాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్హతలు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, 21 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు అర్హు లని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 10,000 నుంచి రూ. 40,000 వరకు జీతం ఉం టుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27న బ్రాడీపేట 3/9 క్యాంపస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

అబాకస్ పోటీల్లో భారతీయ విద్యాభవన్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పీ రామచంద్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో స్థానిక ఏటీ అగ్రహారం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో పోటీలు నిర్వ హించారు. 5వ తరగతి విద్యార్థి జీ కిషోర్‌కుమార్ ప్రథమ బహుమతి, 6వ తరగతి విద్యార్థి కే కార్తికేయ, 3వ తరగతి విద్యార్థి వేదాంష్ ద్వితీయ బహు మతులు, 3వ తరగతి విద్యార్థి దేవాన్ష్ కన్సోలేషన్ బహుమతులు సాధిం చారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను కోశాధికారి కే రామ్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం కృష్ణఉషశ్రీ అభినందించారు.

జిల్లా స్థాయిలో 'ఉషోదయ' విద్యార్థులకు ప్రథమస్థానం

గుంటూరు(విద్య),డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో డాక్టర్ కే ఎల్ పీ పబ్లిక్ స్కూల్ నిర్వహించిన 'స్పెల్ బీ' పోటీల్లో చౌడవరంలోని ఉషోదయ ఇంగ్లీషు స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ విష యాన్ని సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్ మంగాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో సహా 30 పాఠశాలలు పాల్గొనగా అందులో ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చౌడవరం విద్యార్థులు ఐ.హసీనా బేగం(10వ తరగతి), ఎస్‌ఎమ్‌బీ రిద(8వ తరగతి)విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను మంగాదేవి అభినందించారు. ఈ సంద ర్భంగా విజేతలను సీఏఓ దుర్గా రఘురామ్, చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎండీ నస్రీన్, లక్ష్మీ ప్రసన్న, మల్లికార్జునరావు, వెంక టేశ్వర్లు అభినందించారు.


బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న పార్టీ నేతలు

మహానేత వాజ్‌పేయి: జూపూడి రంగరాజు

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో సుపరిపాలనకు పరమార్థం తెలియజేసిన మహానేత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజపేయి అని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు అన్నారు. బుధవారం వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా స్థానిక లాలుపురంలోని బీజేపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికిపార్టీ సీనియర్ నాయ కుడు నేరెళ్ల మాధవరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా రంగ రాజుతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, సీనియర్ నాయకుడు వనమా పూర్ణచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ దేశాన్ని వాజ్‌పేయి ముందుకు నడిపిన తీరు జన హృదయాల్లో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతుం దన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ దేశప్రగతి కోసం నిరంతరం తపించిన వాజ్‌పేయి, తన నాయకత్వంతో నవ భారత నిర్మాణానికి బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ శనక్కాయల అరుణ, ఈదర శ్రీనివాసరెడ్డి, దారా సాంబయ్య, జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తా

● మాజీ కార్పొరేటర్ యేల్చూరి

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యాపారుల సమస్యల పరిష్కరానికి మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడి పదవికి బరిలో నిలిచిన యేల్చూరి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని గౌడీయమఠం వద్దనున్న కొత్తూరి బాలకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అధ్యక్షతన వ్యాపారవర్గాలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యేల్చూరి మాట్లాడుతూ వ్యాపారులకు అండగా నిలుస్తానని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ 28న జరిగే ఎన్నికల్లో వ్యాపారులంతా తనకు ఓటు వేసి గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, చాం బర్ ఆఫ్ కామర్స్ మాజీ ఉపాధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, టీడీపీ నాయకుడు కొనకళ్ళ సత్యం తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యేల్చూరి వెంకటేశ్వర్లు, వేదికపై ఆంజనేయులు తదితరులు

ప్రారంభోత్సవం ప్రశ్నార్థకమేనా?

● బుడంపాడు 33 కేవీ సబ్‌స్టేషన్ పనులు పూర్తయి రెండు నెలలు
● అందుబాటులోకి రాకపోవడంపై విమర్శలు


బుడంపాడులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం పరిధిలోని బుడంపాడులో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు పూర్తయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నాయి. దీని ప్రారంభోత్సవానికి మాత్రం సంబంధిత శాఖాధికారులు మీన మేషాలు లెక్కి స్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు విని పిస్తున్నాయి. ఏపీసీపీడీసీఎల్ కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే నగరంతో పాటు రూరల్ మండలంలోని పలు ప్రాం తాలకు విద్యుత్ కష్టాలు తీరినట్లవుతుంది. ఆ ప్రాంతంలో స్థలాన్ని సేకరించి, నాణ్యమైన విద్యుత్‌సరఫరా కోసం ఈ సబ్‌స్టేషన్ పనులు మూడేళ్ళ కిందటే చేపట్టారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైన్‌లతో పాటు అందులోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ చార్జింగ్ పనులు కూడా పూర్తి చేశారు. కానీ, సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం గురించిన ప్రస్తావనే లేదు. దీని ప్రారంభోత్సవానికి అడ్డంకి ఏంటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటం లేదన్న సాకు కూడా ప్రచారంలో ఉంది. బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందా అని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.


శ్రీనివాసరావుపేటలో ఏ1 కన్వెన్షన్ ఎదుట పైపులైను లీకేజీతో వృథా అవుతున్న తాగునీరు

పైపులైన్ లీకేజీలు.. చేపట్టని చర్యలు!

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేటలో తాగునీటి పైపులైను నెట్‌వర్కు అధ్వానంగా మారింది. ఇక్కడి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పంపింగ్ జరిగే పైపులైనుతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లకు పెద్ద సంఖ్యలో లీకేజీలు ఏర్పడ్డాయి. ఇటీవల నగరమంతటా నీటి సరఫరా నిలిపేసిన సందర్భంలో కొన్ని లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు నిర్వహించారు. అయితే, అవి విఫలమయ్యాయి. పైపులైను లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులు తమ కేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. హెచ్‌డీపీఏ పైపులైన్లకు ఏర్పడ్డ లీకేజీలకు క్లాంపు అమర్చి అరికట్టాలని చూస్తున్నారు. తాగునీటి సరఫరా జరిగే సమయంలో నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇక్కడ పర్యటించాలని, లీకేజీలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చుట్టుగుంట వైపు నుంచి వచ్చే వాహనాలు బారికేడ్ల వద్ద నిలిచిపోయిన చిత్రం

పట్నంబజారు వెళ్ళాలంటే పాట్లు పడాల్సిందే!

● ఎత్తురోడ్డు వద్ద అడ్డంగా బారికేడ్లు
● ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనచోదకుల పాట్లు


ఎత్తురోడ్డు సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

పట్నంబజారు (గుంటూరు విద్య), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని కూడళ్ళ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు ప్రమాదాలను తెచ్చి పెడుతున్నాయి. రోడ్డు సగం మూసుకుపోయేలా ఏర్పాటు చేసిన బారికేడ్లు ప్రమాదాలు తెచ్చిపెడు తున్నాయి. మరోవైపు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎత్తు రోడ్డు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల నిత్యం ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చుట్టుగుంట వైపు నుంచి పట్నంబజారులోకి వెళ్లేందుకు ఎత్తురోడ్డు వద్ద పెట్రోల్ బంకు పక్కగా మార్గం ఉంది. ట్రాఫిక్ పోలీసులు కొన్నిరోజుల క్రితం ఈ మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. చుట్టుగుంట సెంటర్ నుంచి నర్సరావుపేట, చిలకూరిపేటకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలనీల ప్రజలు పట్నం బజారులో వెళ్ళాలంటే హిందూ కళాశాల సిగ్నల్, హిమనీ కూడలి సిగ్నల్ దాటుకుని రావాలి. లేదా నల్లచెరువు వైపు యూటర్న్ తీసుకుని పట్నంబజారుకు వెళ్ళాలి. గతంలో ఎత్తురోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకు రోడ్డులో నుంచి నేరుగా పట్నంబజారులో వెళ్ళే అవకాశం ఉందని వాహనచోదకులు చెబుతున్నారు. తాజాగా, ఇక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్ల కారణంగా వాటి పక్కగా వాహనచోదకులు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండ టంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి పట్నంబజారువైపు రోడ్డులోకి వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ నాయకులు ఆళ్ల శివారెడ్డి, రాము తదితరులు

క్రెడాయ్ గుంటూరు చాప్టర్-2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ గుంటూరు నూతన సంవత్సర - 2025 డైరీ ఆవిష్కరణ, జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డైరీని రిలీజ్ చేస్తున్నామన్నారు. ఈ డైరీలో జీవో కాపీలు ముద్రించినట్లు చెప్పారు. నిబంధన ప్రకారం భవన నిర్మాణం చేపడితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అని తెలిపారు. మామిడి రాము మాట్లాడుతూ క్రెడాయి నేషనల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం భవనాలను నిర్మించి ఎటువంటి డీవియేషన్ లేకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు చాప్టర్ చైర్మన్ సతీష్ రెడ్డి, కార్యదర్శి సాంబశివారెడ్డి, వినోద్ రెడ్డి, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం దిల్ రాజుతో కలిసి అల్లు అరవింద్ మరోసారి పరామర్శించారు శ్రీతేజ్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద అల్లు అరవింద్ మాట్లాడుతూ.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. శ్రీతేజ్ శరీరంలో పూర్తి స్థాయిలో కదలికలు వచ్చాయని చెప్పారన్నారు. అతని ఆరోగ్యం పూర్తిస్థాయిలో మెరుగు పడేంతవరకు అన్నిరకాల వైద్య చికిత్సలు అందించడానికి తమవైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని మనందరితో కలిసి తిరుగుతాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబానికి చేయదలచుకున్న ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా దిల్ రాజుకు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నాం..

శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా శ్వాస తీసుకోగలుగుతున్నాడని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. అతని కుటుంబానికి అల్లు అర్జున్, నిర్మాతలు, దర్శకుడి తరఫున రూ.2 కోట్ల సాయం అందజేశామన్నారు. గురువారం సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నామని చెప్పారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో సినీ పరిశ్రమ ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పరామర్శించారు. సినిమా కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున అండగా ఉంటామని చెప్పారు.

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు నిజమే

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. అతను తన వద్ద పనిచేసిన సహాయ నృత్య దర్శకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు చార్జిషీట్ దాఖలు చేశారు. జానీ మాస్టర్ ఆమెను ఈవెంట్ల పేరుతో పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత యువతి సెప్టెంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించగా, కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అక్టోబరు 25న విడుదలయ్యాడు.

జనవరి 21న కృష్ణా బోర్డు భేటీ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సమావేశం వచ్చే నెల 21వ తేదీన జరుగనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బోర్డు సమాచారం పంపింది. బోర్డు ఆర్థిక వ్యవహారాలు, రెండు రాష్ట్రాలూ ఇవ్వాల్సిన నిధులు, బోర్డు విధివిధానాల ఖరారు, అమరావతికి బోర్డు తరలింపును ఉమ్మడి ఎజెండాలో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ఆరు చర్చనీయాంశాలను ప్రతిపాదించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణకు తిప్పి పంపిన నేపథ్యంలో ఈ భేటీలో బోర్డు ఏం చెబుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామని ఇటీవల జలశక్తి శాఖ తెలిపింది. 21న జరిగే భేటీలో అయినా దీనిని తేల్చుతారా.. ఎప్పటి మాదిరిగానే దాటవేస్తారా అనే సందేహం నెలకొంది. విభజన చట్టం ప్రకారం ఏనాడో విజయవాడలో కేఆర్‌ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. కృష్ణా నదితో ఎలాంటి సంబంధమూ లేని విశాఖకు ఈ కార్యాలయాన్ని తరలించాలని ప్రతిపాదించారు. దీనిని కేఆర్‌ఎంబీ కూడా గుడ్డిగా సమర్థించింది.

అమ్మ వచ్చింది!

పాతికేళ్ల తర్వాత కలుసుకున్న తల్లీపిల్లలు

- ఉద్వేగంతో ఉబ్బితబ్బిబ్బయిన కుటుంబం
- పెళ్లికి వెళ్లి తప్పిపోయిన సాకమ్మ
- అధికారుల చొరవతో నిరాశ్రయుల కేంద్రం నుంచి ఇంటికి



ఎయిర్‌పోర్టులో తల్లిని హత్తుకుని విలపిస్తున్న కుమారులు

ఇరవై ఐదేళ్ల క్రితం అదృశ్యమైన అమ్మ... ఒక్కసారిగా కళ్లముందు ప్రత్యక్షం. అంతే, ఆ పిల్లలు ఉద్వేగానికి గురయ్యారు...కట్టలు తెంచుకుని వచ్చిన కన్నీళ్లను తుడుచుకుని కన్నతల్లిని హత్తుకున్నారు. వారిని చూడగానే ఆ తల్లి పరిస్థితీ అంతే...పిల్లలను ఈ జన్మలో చూస్తానో చూడనో అంటూ తపించి, తల్లడిల్లుతున్న మాతృహృదయానికి ఎట్టకేలకు సాంత్వన చేకూరింది.

సాకమ్మ.... పాతికేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం హొసపేటలో బంధువుల ఇంట పెళ్లికి వెళ్లి పొరబాటున వేరే రైలు ఎక్కేశారు. ఆరైలు రాష్ట్రాల సరిహద్దులు దాటిపోయింది. రైలు దిగి ఎక్కడెక్కడో తిరిగి సాకమ్మ హిమాచల్‌ప్రదేశ్ చేరారు. అక్కడి అధికారులు అనాథ మహిళగా భావించి, మండి జిల్లా నిరాశ్రయుల కేంద్రంలో చేర్పించారు. ఆమెకు మతిస్థిమితం కాస్త సరిగా లేకపోవడంతో ఇలా జరిగింది. ఆమె కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఎనిమిది రోజులకు గుర్తు తెలియని మహిళ మృతదేహం చిక్కినట్లు పోలీసులు తెలపడంలో వెళ్లి చూసి, సాకమ్మదే అని భావించి అంత్యక్రియలు కూడా నిర్వహించారు.

ఆ అధికారి చొరవతో..: కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి రవినందన్ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. ఆయన సాకమ్మ గురించి తెలుసుకుని, బెంగళూరులోని తన స్నేహితులకు వీడియో పంపించారు. వారు సాకమ్మ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి పి.మణియణ్ణన్ స్పందించారు. ఐపీఎస్ అధికారి రవినందన్‌ను సంప్రదించి, సాకమ్మ వివరాలను సేకరించారు. ఆమె బళ్లారివాసి అని తెలుసుకుని, ఇక్కడి అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులు, పిల్లలు బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలో ఉన్నట్టు గుర్తించారు. హిమాచల్‌ప్రదేశ్‌కు అధికారుల బృందం వెళ్లి..వీడియో కాల్ చేసి కుమారుడు విరాట, కూతురు లక్ష్మిని సాకమ్మకు చూపించి, మాట్లాడించారు. ఆమెను చూసి గుర్తుపట్టిన ఆ కుటుంబం ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. అధికారుల బృందం ఆమెను హిమాచల్ ప్రదేశ్ నుంచి విమానంలో మంగళవారం రాత్రి బెంగళూరుకు తీసుకు వచ్చింది. అప్పటికే ఎయిర్ పోర్టుకు చేరుకున్న సాకమ్మ ఇద్దరు కుమారులు తల్లిని చూడగానే ఉద్వేగంతో కళ్లనీళ్లు పెట్టుకున్నారు. సంక్షేమ శాఖ ఉన్నతాధికారి మణియణ్ణన్ బుధవారం సాకమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రత్యేక వాహనంలో వారంతా స్వస్థలానికి బయలుదేరారు.

-బళ్లారి గాంధీనగర్, ఆంధ్రజ్యోతి

వర్షం రాకతో కొత్త పెట్టె కొనుగోలు!

- పార్శిల్‌లో మృతదేహం కేసులో కొత్త కోణాలు
- ఆస్తి కోసం అక్కనే బెదిరించేందుకు చెల్లెలు, మరిది పన్నాగాలు



గాంధీనగర్‌లోని నిందితుని ఇంటి వద్ద ఉన్న మారో చెక్క పెట్టె

భీమవరం క్రైం/ఉండి/కాళ్ల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో కలకలం రేపిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సాగి తులసి మరిది తిరుమాని శ్రీధర్‌వర్మ(అలియాస్ సుధీర్ వర్మ, అలియాస్ సిద్ధార్థ వర్మ) పోలీసుల అదుపులో ఉన్నాడు. శ్రీధర్‌వర్మ కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యను హత్య చేసి బాక్సులో పెట్టి.. యండగండికి పంపించిన ఘటనలో తులసి చెల్లెలు అయిన రెండో భార్య.. రేవతి పూర్తి సహకారం అందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. మూడో భార్య సుష్మ కూడా సహకారం అందించినట్లు భావిస్తున్నారు.


హత్య కేసుగా మార్పు

ఈ నెల 17న బర్రె పర్లయ్యను హత్య చేసేందుకు శ్రీధర్ వర్మ పక్కా ప్రణాళికతో చెక్క పెట్టెను సిద్ధం చేసుకున్నాడు. మద్యం తాపించి ఉండి మండలం వాంద్రం గ్రామ సమీపంలో హత్య చేశాడు. మృతదేహాన్ని చెక్కపెట్టెలో పార్శిల్ చేయడానికి గాంధీనగర్ తీసుకువెళుతుండగా వర్షం కురవడంతో, కారు ముందుకు వెళ్లే అవకాశం లేకపోయింది. దీంతో శవాన్ని కారులోనే ఉంచి, మరొక పెట్టెను కైకలూరు నుంచికొని తెచ్చాడు. అనంతరం మృతదేహాన్ని గణపవరం మండలం సాగిపాడు వద్దకు పెట్టెలో తీసుకువెళ్లి మూడో భార్య సుష్మ సాయంతో ఆటోకు అప్పగించి తులసికి డోర్ డెలివరీ చేశారు. ఇప్పటి వరకు అనుమానాస్పద కేసుగా ఉంచిన పోలీసులు బుధవారం దీనిని హత్య కేసుగా మార్పు చేశారు. తులసికి చెందిన ఆస్తిని కాజేయడం కోసమే శ్రీధర్‌వర్మ, అతడి రెండో భార్య రేవతి పన్నాగం పన్నారని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి భీమవరంలోని పలు నగల దుకాణాల్లో బంగారం తాకట్టు పెట్టి, మరికొంత విక్రయించినట్లు తెలియడంతో బుధవారం మూడు బంగారం దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గాంధీనగర్‌లో మొదటి భార్య ఇంట్లో క్షుద్రపూజలకు సంబంధించిన కొన్ని వస్తువులు, పుస్తకాలు పోలీసులకు దొరికాయి. కృష్ణా జిల్లా మల్లంపూడిలో శ్రీధర్ వర్మ తల్లిదండ్రులను, ఆయన ముగ్గురు భార్యలు, పిల్లలు, యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, అతడి భార్య హైమావతి, సాగి తులసిలను పోలీసులు వేర్వేరుగా పలు ప్రదేశాల్లో విచారిస్తున్నారు. ఒకట్రెండ్రోజుల్లో వివరాలు పూర్తిగా వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు.

కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు.. సీనియర్ ఐఏఎస్ దానకిషోర్ వాంగ్మూలం!

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం.. నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ



దానకిషోర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేసి కీలక ఆధారాలు సేకరించారు. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిస్‌లు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎస్‌ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30న ముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం.

దిశ మార్చుకున్న తీవ్ర అల్పపీడనం

- నేడు బలహీనపడుతుందన్న వాతావరణశాఖ
- కోస్తా జిల్లాలకు వర్షసూచన.. పెరిగిన చలి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం దిశ మార్చుకుంది. మంగళవారం వరకూ పశ్చిమ నైరుతిగా పయనించిన తీవ్ర అల్పపీడనం తరువాత వాయవ్యంగా పయనిస్తోంది. బుధవారం మధ్యాహ్నానికి దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడుకు సమీపంలో కొనసాగుతోంది. గురువారం నాటికి వాయవ్యంగా పయనించి పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల బుధవారం ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం మీదుగా గాలులు వీయడం, చిరుజల్లులు కురుస్తుండడంతో కోస్తాలో చలి వాతావరణం కొనసాగింది. అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక కొనసాగుతుంది. గురువారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి తేమగాలులు బలంగా రావడంతో ప్రస్తుతం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనానికి అవసరమైన తేమ లభిస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత



ప్రముఖ మలయాళ రచయిత, సినీ దర్శకుడు ఎంటీ వాసుదేవన్ నాయర్ (91) బుధవారం రాత్రి కోళిక్కోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆయన కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. పాలక్కాడ్ సమీపంలోని కడలూరు ఆయన సొంతూరు. వాసుదేవన్ నాయర్‌కు బాల్యం నుంచే మలయాళ సాహిత్యంపై ఆసక్తి కలిగింది. ఆయన కలం నుంచి జాలువారిన బాల సాహిత్యం, కథలు, పర్యాటక రచనలు, వ్యాసాలు, నవలలు మలయాళ సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. 'నాలుకెట్టు, అసురవిత్తు, మంజు, సర్పవిత్తు' తదితర రచనలు విశేష పాఠకాదరణ పొందాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వాసుదేవన్ 54 చిత్రాలకు స్ర్కీన్‌ప్లే అందించారు. ఏడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం', 'కడవు' సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకూ ఉత్తమ స్ర్కీన్‌ప్లే రచయితగా నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్న అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. వాసుదేవన్ రాసిన తొమ్మిది కథల ఆధారంగా తెరకెక్కిన 'మనోరథంగల్' వెబ్‌సిరీస్ ఈ ఏడాది ప్రముఖ ఓటీటీలో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఆయన పైన గౌరవంతో ఈ సిరీస్‌కు కమల్‌హాసన్ సమర్పకుడిగా వ్యవహరించగా, మోహన్‌లాల్, మమ్ముట్టి, ఫహద్ ఫాజిల్ లాంటి పలువురు అగ్రతారలు నటించారు. 1996లో జ్ఞానపీఠ్, 2005లో పద్మభూషణ్, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఆయన అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వాహక సభ్యుడుగా, కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఇండియన్ పనోరమ ఛైర్మన్‌గా ఆయన సేవలందించారు. కొంతకాలం మాతృభూమి వారపత్రికకు సంపాదకుడిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. వాసుదేవన్ నాయర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

హిట్ అవుతుందని ప్రభాస్ చెప్పారు

హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా కచ్చితంగా మీ అందర్నీ కదిలిస్తుంది. ధర్మకు ఉత్తమ పరిచయ నటుడిగా అవార్డు రావడం పక్కా. కథను నమ్మి నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. చివరి 40 నిమిషాలు సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు. "ఈ సినిమాను నిర్మించే విషయంలో నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. నా అభిమాన హీరో ప్రభాస్‌ను కలసినపుడు ఈ సినిమాకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. "సినిమా బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కంటెంట్ బాగుందని మెచ్చుకుంటున్నారు" అని తెలిపారు.





ఆంజనేయస్వామి సేవలో హైకోర్టు జడ్జి

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఆంజ నేయ స్వామి దేవస్థానాన్ని బుధవారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో సుభద్ర, అర్చకులు జడ్జి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం స్వామి ని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మాందీశ్వరుడి శివలింగ ప్రతిష్ఠ



మాందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న సుధాకర్‌నాయుడు

మంగళగిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు గణపతి నగర్ రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మాందీశ్వరుడి శివలింగాన్ని ప్రతిష్ఠిం చారు. మంచాల సాయిసుధాకర్ నాయుడు, కుటుంబ సభ్యులు కాశీ జలం, పసుపు, కుం కుమ, నెయ్యితో అభిషేకాలు నిర్వహిం చారు. నవగ్రహాల సంకల్పంతో శనేశ్వరుడికి కుమా రుడిగా మాందీశ్వర స్వామి జన్మించారని, స్వామివారిని నమస్కరించుకుంటే దుర్మర ణాలు, దుష్ట సంఘటనలు తొలగడమే కాకుం డా ప్రేత కర్మలు, బాధలు ఉండవని తెలిపా రు. కార్యక్రమంలో విగ్రహ సంకల్పకర్త రుక్కు మన్మథరావు, సిద్ధాంతి గణేష్, వీరరాఘవరెడ్డి, తాడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ శత వార్షికోత్సవ సభ

మంగళగిరి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్స రాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళ గిరి సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్ వద్ద గురువారం సాయంత్రం బహి రంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియో జకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ ఇన్‌చార్జి కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు తెలిపారు. పార్టీ ముఖ్య నేతలు హాజరై సీపీఐ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు చేసిన పోరా టాలు, సాధించిన విజయాలను గురించి వివ రిస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని సీపీఐ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై శత వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

29న జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

మంగళగిరి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఏటీ అగ్రహారం నాలుగో లైనులోని ది సెంట్రల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 29న జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. సబ్ జూనియర్స్, జూని యర్స్, సీనియర్స్, మాస్టర్స్ పురుషులు, మహి ళల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయ న్నారు. పాల్గొనదలచిన వారు వయస్సు ధ్రువీ కరణ పత్రాలతో హాజరుకావాలని, 29న ఉద యం 7 గంటలకు శరీర బరువు చూస్తామని తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 97008 44497, 9346307979 నెంబర్లలో సంప్రదించా లని సూచించారు.

ఘనంగా రేణుకాంబ ఎల్లమ్మ దేవస్థాన వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో రేణుకాంబ ఎల్లమ్మవారు

పెదనందిపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాలపర్రులో రేణుకాంబ, ఎల్లమ్మ పోతురాజుల దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివా సాచార్యులు అమ్మవారికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దాత లు, గ్రామస్థుల సహకారంతో అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమాలను కమి టీ సభ్యులు పర్యవేక్షించారు.

22వ రోజుకు చేరుకున్న కార్మికుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 22వ రోజు కు చేరుకున్నాయి. దీక్షల్లో తుపాకుల నాగేశ్వర రావు, ఎం సుబ్బారావు, ఎస్కే ఖాసిం, షంషు ద్దీన్, శివరామయ్య కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ నేత కె.ఆదినారాయణ, సీఐటీయూ నేత వేము ల దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల సమస్యను మరింత జటిలం చేస్తున్న యజ మానులపై రాష్ట్ర ప్రభుత్వం మెతకవైఖరి అవలంబించడం సరికాదని వ్యాఖ్యానించారు. లోకేశ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, అంకయ్య, ఆశీర్వాదం, యెహోషువ, జానీ, దుర్గా భవాని, సూర్యప్రకాష్, కృష్ణ, సాంబ య్య, గురవయ్య, ఆరిఫ్, శివకుమారి, ఇజ్రా యేలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంక రించారు. భక్తులు పెద్దసంఖ్యలో ప్రార్థనా మందిరా లకు తరలిరావడంతో సందడి నెలకొంది. క్రిస్మస్ సందర్భంగా మత ప్రబోధకులు క్రీస్తు సందేశాలను భక్తులకు వివరించారు. ప్రార్థనా మందిరాలో క్రీస్తు జననాన్ని లోకానికి వెలుగుగా భావిస్తూ క్యాండిల్ నైట్ సర్వీస్ నిర్వహించారు. మంగళగిరి పార్కు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి, హోలీలార్డ్ పెంతెకొస్తు చర్చి, సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాలు, పాతమంగళగిరిలోని మంచికాపరి లూథరన్ దేవాలయం, కృపా ప్రార్థనా మందిరం, నిర్మల మాత దేవాలయం, మసీదు వీధి లోని లూథరన్ చర్చి, వడ్లపూడి సెంటరులోని తెలుగు బాపిస్టు చర్చి, రూపాంతర దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శాంతిదూత మినిస్ట్రీస్ ఆధ్వర్యం లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అపోస్తలిక్ చర్చి ఫాదర్ ఎం సుధీర్, కే రూఫస్, కేకే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పరిశుద్ధ పౌల్ లూథరన్ చర్చిలో క్రీస్తు జన్మదిన సందేశాన్ని కాకి జాన్ అం దించారు. ప్యారిస్ పాస్టర్ కంభం వరప్రసాద్, అద నపు కాపరి నామా నవీన్, ఎం దయారత్నం, సంఘ పెద్దలు, సండే స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

లివింగ్ క్రైస్ట్ చర్చిలో..

మంగళగిరి పట్టణంలోని గౌతమబుద్ధ రోడ్డులో వీజేపీ అండ్ డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ఎదురు ఉన్న లివింగ్ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరిం చుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ పీటర్, జాకబ్‌రాజు, విజయకుమార్, డేవిడ్ లివింగ్ స్టోన్ సంఘస్తులు, స్థానికులు పాల్గొన్నారు. తెనాలికి చెందిన మధు వాక్య సందేశమిస్తూ క్రీస్తు బోధనలు అనుసరణీయమని ప్రతిఒక్కరూ శాంతి సహనం కలిగి ఉండాలని వ్యాఖ్యానించారు.



మంగళగిరిలో క్రిస్మస్ ఆరాధనల్లో పాస్టర్లు, చిన్నారులు

ముగ్గురోడ్డు తెలుగు బాప్టిస్టు చర్చిలో..

తాడేపల్లి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముగ్గురోడ్డు తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ పర్వదినాన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి పాస్టర్ కేకే రవికుమార్, సంఘస్తులు, సంఘ పెద్దలు, సంఘ పరిచారకులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



బడేపురం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ రాయన్న

దుగ్గిరాల మండలంలో..



రేవేంద్రపాడులోని చర్చిలో క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ జక్కరయ్య

దుగ్గిరాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు తమ ఇళ్ల ముం గిట్లో క్రిస్మస్ చెట్టును విద్యుద్దీపాలతో అలంకరించగా, వివిధ సంఘాల ఆధ్వర్యంలో క్రైస్తవ ప్రార్థనా మం దిరాలు, చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు, క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రైస్తవులు, మహిళలు చర్చిలకు, ప్రార్థనా మందిరాలకు చేరుకోగా పాస్టర్‌లు క్రీస్తు బోధనలను వివరించారు. రేవేంద్ర పాడు మెయిన్‌రోడ్‌లోని చర్చిలో పాస్టర్ జక్కరయ్య క్రీస్తు భక్తులకు శాంతి, దయ, జాలి, కరుణ చూపా లని క్రీస్తుతత్వాన్ని బోధించారు. పలు గ్రామాల్లోని చర్చిలలో పాస్టర్‌లకు, నూతన వస్త్రాలను టీడీపీ నాయకుల చేతులమీదుగా అందించారు.

తాడికొండ మండలంలో..

తాడికొండ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని వివిధ క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. చర్చి పాస్టర్లు దేవుని వాక్య సందే శాన్ని క్రైస్తవులకు బోధించారు. తాడికొండలోని తెలుగు బాప్టిస్టు చర్చి, లూథరన్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాడికొండలోని తెలుగు బాపిస్టు చర్చిలో కిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. బడేపురంలోని ఆర్‌సీఎం చర్చిలో దివ్య పూజాబలి నిర్వహించారు. నూజివీడు విచారణ గురు వులు ఫాదర్ మల్లవరపు రాయన్న, పెదపరిమి విచా రణ గురువులు ఫాదర్ ప్రకాష్, సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి పెద్ద ఎత్తున బాణాసంచాను కాల్చారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించి కేకులను కట్ చేసి క్రిస్మస్‌కు స్వాగతం పలికారు. నిడుముక్కల, లచ్చనగుడిపూడి, మోతడక, రావెల, పొన్నెకల్లు, పాములపాడు, బేజా త్పురం, బండారుపల్లి, కంతేరు, గరికపాడు, ఫణిదరం, దామరపల్లి, ముక్కామల, లాం గ్రామాల్లోని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందారు.



మంగళగిరిలో క్రిస్మస్ ఆరాధనల్లో పాల్గొన్న విశ్వాసులు

కాకుమాను మండలంలో..

కాకుమాను, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండ ల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. వేకువజామున క్రీ స్తు రాకను పురస్కరించుకుని కొవ్వొత్తుల ప్రదర్శన ని ర్వహించారు. దైవ గీతాలాపనలు చేస్తూ, గ్రామ వీ ధుల్లో ప్రదర్శనలు జరిగాయి. సుమారు 50 సంవత్స రాల పై చరిత్ర కలిగిన అప్పాపురం ఆంధ్రా ఇవాంజి కల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. ఉపవాస దీక్షలను అర్ధరాత్రి విరమించారు. పాస్టర్ దైవప్రసంగం చేసి బైబిల్ వాక్యాలను బోధించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అలాగే కాకుమానులో ఆంధ్రా ఇవాం జికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయం, కొమ్మూరు, కొండపాటూరు, చిన్నకాకుమాను, గరికపాడు, బీకే పాలెం తదితర గ్రామాల్లోని చర్చిలతో పాటు, క్రీస్తు ఉత్థాన దేవాలయం, హెబ్రోను ప్రార్థన మందిరం త దితర చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగా యి. ప్రార్థన మందిరాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుక లు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా చ ర్చిల్లో పాస్టర్‌లు క్రిస్మస్ విశిష్టతను భక్తులకు వివరిం చారు. ప్రజలు శాంతియుతంగా జీవిస్తూ, తోటివారి పట్ల దయ, కరుణ, క్షమాగుణం కలిగి ఉండాలన్నా రు. అనంతరం గ్రామాల్లో క్రీస్తు పుట్టుక నాటికలు ప్ర దర్శించి, జెండాలను ఊరేగింపు చేశారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

మంగళగిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలను కొనియాడా రు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్, యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా నవనీత్ కృష్ణారెడ్డి, నేతలు బొక్కా నరసింహారావు, జవ్వాది అమ్మయ్య చౌదరి, తుల్లిమిల్లి శ్రీనివాసరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, మారెళ్ల సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు. వాజ్‌పేయి జయం తి సందర్భంగా అటల్ జనసభ అధ్యక్షుడు మైలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో గండికోట కోటేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, రావకొండ కోటేశ్వరరావు తదితర లు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

పెదనందిపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని వరగానిలో గ్రామ బీజేపీ ఆధ్వ ర్యంలో బుధవారం అటల్ బిహార్ వాజ్‌పేయి శత జ యంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడు తూ ప్రధానిమంత్రిగానే కాకుండా దేశం కోసం అలు పెరగని పోరాటం చేసి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్టు నాగరాజు, గ్రామ పార్టీ అ ధ్యక్షుడు వెలగా గంగాధరరావు, నాయకులు సీహెచ్ నాగిరెడ్డి, భీమినేని రవి, బొల్లేపల్లి బాజీబాబు, చెన్ను పాటి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



బీసీ హాస్టల్‌లో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

కాకుమానులో...

కాకుమాను, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అజా త శత్రువు అని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపా ధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. దేశంలో స్వర్ణ చతుర్భుజి పేరుతో జాతీయ రహదారులు అనుసంధానం చేసిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. ప్రధానమంత్రి గ్రా మ సడక్ యోజన పేరుతో గ్రామీణ రహదారులకు కూడా మహర్దశ వచ్చిందన్నారు.

వట్టిచెరుకూరు బీసీ హాస్టల్‌లో

వట్టిచెరుకూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ హాస్టల్‌లో బుధవా రం మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతిని మండ ల బీజేపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి తియ్యగూర కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాస్టల్ విద్యా ర్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో బీజేపీ ప్రధాన కార్యదర్శి జాగర్లమూడి నరేంద్ర నాథ్, మండల అధ్యక్షుడు వేల్పూరి రమేష్, యువజన విభాగం కే.సదాశివరావు, పార్టీ కార్యవర్గ సభ్యులు శోభన్‌బాబు, బూత్ కమిటీ అధ్యక్షులు కే వాసుదేవ మూర్తి, టీ.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాల లోని బీజేపీ కార్యాలయంతో పాటు, జిల్లా మాజీ కార్యదర్శి కొంగర జోగేంద్ర గృహంలోనూ దివంగత మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వ హించారు. బీజేపీ దేశవ్యాప్తమయ్యేందుకు, దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను పలువురు వక్తలు స్మరిం చారు. బీజేపీ మండల అధ్యక్షుడు పసుపులేటి గణేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామ హేశ్వరరావు, జిల్లా మాజీ కార్యదర్శి కొంగర జోగేంద్ర ప్రసాద్, కొండపనేని రవీంద్రరావు, పాటిబండ్ల రాజా, తాడిబోయిన శ్రీధర్, ఎద్దు సిద్ధార్థ, మోహనరావు, గడ్డ శేషగిరి, సైమన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం ప్రశ్నార్థకమేనా?

● బుడంపాడు 33 కేవీ సబ్‌స్టేషన్ పనులు పూర్తయి రెండు నెలలు

● అందుబాటులోకి రాకపోవడంపై విమర్శలు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం పరిధిలోని బుడంపాడులో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులు పూర్తయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నాయి. దీని ప్రారంభోత్సవా నికి మాత్రం సంబంధిత శాఖాధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీనిపై సర్వ త్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీసీపీడీసీ ఎల్ కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే నగరంతో పాటు రూరల్ మండలంలోని పలు ప్రాంతాల కు విద్యుత్ కష్టాలు తీరినట్లవుతుంది. ఆ ప్రాంతంలో స్థలాన్ని సేకరించి, నాణ్యమైన విద్యుత్‌సరఫరా కోసం ఈ సబ్‌స్టేషన్ పనులు మూడేళ్ల కిందటే చేపట్టారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్‌లైన్‌లతో పాటు అందు లోని పవర్ ట్రాన్స్ ఫార్మర్స్ చార్జింగ్ పనులు కూడా పూర్తి చేశారు. కానీ, సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం గురించిన ప్రస్తావనే లేదు. దీని ప్రారంభోత్సవానికి అడ్డంకి ఏంటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సబ్‌స్టేషన్ ప్రారంభోత్స వానికి ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉం డటం లేదన్న సాకు కూడా ప్రచారంలో ఉంది. బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందా అని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.



బుడంపాడులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్

పశ్చిమ డెల్టా కాల్వకు 1616 క్యూసెక్కులు

దుగ్గిరాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వ కు 1616 క్యూసెక్కుల సాగునీటిని బుధవా రం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీవద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 70 క్యూసెక్కు లు, తూర్పు కాల్వకు 67, నిజాంపట్నం కాల్వకు 73, కొమ్మమూరు కాల్వకు 1095 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

శ్రీనగర్‌లో వ్యక్తి అదృశ్యం

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీనగర్‌కి చెందిన దుండి వెంకటరెడ్డి అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. వెంకటరెడ్డి (58) అనే వ్యక్తి కూలి పనులు చేసి జీవిస్తుంటాడు. ముగ్గురు కుమార్తెలకి పెళ్ళిళ్ళు చేశాడు. ఈ నెల 21న మధ్యాహ్నం నుంచి కనిపించకుం డా పోయాడు. అతని భార్య అయిన దుండి వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరం డల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీలు.. చేపట్టని చర్యలు!



శ్రీనివాసరావు పేటలో ఏ1 కన్వెన్షన్ ఎదుట పైపులైను లీకేజీతో వృథా అవుతున్న నీరు

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావు పేటలో తాగు నీటి పైపులైను నెట్‌వర్కు అధ్వానంగా మారింది. ఇక్క డి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పంపింగ్ జరిగే పైపులైనుతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపు లైన్లకు పెద్ద సంఖ్యలో లీకేజీ లు ఏర్పడ్డాయి. ఇటీవల నగరమంతటా నీటి సరఫరా నిలిపేసిన సందర్భంలో కొన్ని లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు నిర్వహించారు. అయితే, అవి విఫలమయ్యాయి. పైపు లైను లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులు తమ కేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. హెచ్‌డీపీఏ పైపులైన్లకు ఏర్పడ్డ లీకేజీలకు క్లాంపు అమర్చి అరికట్టా లని చూస్తున్నారు. తాగునీటి సరఫరా జరిగే సమయంలో జీఎంసీ కమిషనర్ శ్రీని వాసులు లీకేజీలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు(విద్య), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కామర్స్ విద్యా రంగంలో ఇరవై రెండేళ్ల అనుభవం గల మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. జాబ్‌మేళాలో ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జులు, క్లాస్ ఇన్‌చార్జులు, హాస్టల్ స్టాఫ్, అకౌం టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్లు, డ్రైవరు పోస్టులకు ఉద్యో గావకాశాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్హతలు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, 21 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.10,000 నుంచి రూ. 40,000 వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27న బ్రాడీపేట 3/9 క్యాంపస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

క్రిస్మస్ శోభతో వెలుగొందుతున్న ఫిరంగిపురం

● భక్తులను ఆకట్టుకుంటున్న పశువుల పాక, తేరులు



పశువుల కొష్టంను వీక్షిస్తున్న భక్తులు

ఫిరంగిపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం క్రిస్మస్ శోభతో బుధవారం వెలుగొందు తుంది. చర్చిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి అలంకరింపజేశారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు విజ్ఞానపురం, శాంతిపేట, గొల్లపాలెం, హౌస్‌గణేష్, వసంత నగర్ తదితర కాలనీలు, గ్రామాల నుంచి వందలాది మంది భక్తులతో మరియమాత, బాల ఏసుల తేరులతో ప్రదర్శనగా మేళతాళాలతో కీర్తనలు పాడుకుంటూ బాణ సంచా పేలుస్తూ బాల ఏసు చర్చి వద్దకు వచ్చారు. అనంతరం తేర్ల వద్ద ఉన్న వందలాది మంది భక్తులు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు చర్చిలోకి వెళ్ళి బాల ఏసును దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు సమర్పించారు. చర్చిలో ఉన్న ఫాదర్లతో ఆశీర్వచనాలు పొందారు. విజ్ఞానపురం, కొత్తపేట, కొత్తపేట కాలనీ, రసూల్‌పేట, తూర్పు వీధి, కార్మెల్‌పేట, క్రీస్తు నగర్‌లలోని ఏసుక్రీస్తు, మేరీ మాత, మరియ మాత, వెళాంగిని మాత, తిరు కుటుంబ మందిరం, స్వర్ణ మందిరాలు విద్యుత్ కాంతులతో దివ్యంగా అలంక రించారు. గ్రామంలోని ప్రతి వీధి మొదట్లో క్రిస్మస్ స్టార్‌లు, వీధుల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలు అలంకరింప చేశారు. దీంతో గ్రామానికి క్రిస్మస్ పండుగకు శోభాయమానంగా మారింది.

పేరేచర్లలో మొబైల్ ఆస్పత్రి ద్వారా వైద్యశిబిరం

మేడికొండూరు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్ల ఇంటె ల్ హైస్కూలు వద్ద మొబైల్ ఆస్పత్రి ద్వారా రెండు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఇంటెల్ హైస్కూలు డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ బు ధవారం తెలిపారు. మాదాల గోవర్ధన్‌రావు చారిటబుల్ ట్రస్ట్, ఇంటెల్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని వివరించారు. ఈ మొబైల్ ఆస్పత్రిలో గుండె సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ ఐ.మారుతిప్రసాద్, డాక్టర్ జి.దీప్తి పాల్గొని రోగులకు వైద్యసేవలు ఉచితంగా అందిస్తారు. ఈ శిబిరంలో గుండె సంబంధిత ఈసీజీ, కిడ్నీ సంబంధించిన రక్త పరీక్షలు, యూరిన్ టెస్ట్‌లు చేయడంతో పాటు మందులు ఉచితంగా ఇస్తారు. అంతేకాకుండా చిన్నపాటి శస్త్ర చికిత్సలు కూడా అక్కడే చేస్తారని, ఈ అవకా శాన్ని మేడికొండూరు మండల సమీప గ్రామాల ప్రజలందరూ వినియోగించు కోవాలని డాక్టర్ జయకుమార్ తెలియజేశారు.

గ్రామాభివృద్ధికి ధూళిపాళ్ల సేవలు ఎనలేనివి



వెంకటేశ్వర్లు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కొల్లా వీరయ్యచౌదరి, రామకృష్ణ

కాకుమాను, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బోడిపాలెం గ్రా మాభివృద్ధికి ధూళిపాళ్ల వెంకటే శ్వర్లు చేసిన సేవలు ఎనలేనివ ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు, నీ టి సంఘాల చైర్మన్ చెన్నుపాటి రామకృష్ణ అన్నారు. మండల ప రిధిలోని బోడిపాలెంలో బుధవా రం ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు 13 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సంగం డెయిరీ మా జీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరితో కలసి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ నీటి సంఘాల అధ్యక్షుడిగా పని చే సిన వెంకటేశ్వర్లు గ్రామంలో తాగు, సాగు నీటి సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని మననం చేసుకున్నారు. అలాగే బోడిపాలెంలో తెలుగుదేశం పార్టీ బలోపే తానికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దొంతినేని శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.20 వేలు అందజేత



నారా లోకేశ్ పంపిన నూతన వస్త్రాలను పాస్టర్లకు అందజేస్తున్న కొల్లి శేషు

తాడేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా తాడే పల్లి మండలం పెనుమాకలోని రారాజు ప్రార్థనామందిరం ప్రహరీ ప్లాస్టింగ్ నిమి త్తం మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు తన సొంత నిధులు రూ.20 వేలు పాస్టర్ ప్రణయ్‌భాస్కర్‌కు అంద జేశారు. అలాగే మంత్రి లోకేశ్ పాస్టర్లకు ఇచ్చిన నూతన వస్త్రాలను ప్రణయ్ భాస్కర్‌కు అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొల్లి శేషు మాట్లాడుతూ త్యాగానికి నిలువెత్తు నిదర్శనం క్రీస్తు జీవితమని ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ శాంతి మార్గాన్ని అనుసరించడమే అసలైన క్రిస్మస్ అని క్రైస్తవు లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాద్, పఠాన్ జానీఖాన్, డోలా కళ్యాణ్, గుండాల రామారావు, ఏసుప్ర సాద్, మునెమ్మ, మరియమ్మ, సంఘస్తులు, పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

మేడికొండూరు గోపాలకృష్ణ చిరస్మరణీయుడు



ముట్లూరులోమేడికొండూరి గోపాలకృష్ణ వర్ధంతిలో పాల్గొన్న సహచరు బృందం

వట్టిచెరుకూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాళం భజన సృష్టికర్త, ముట్లూ రు గ్రామానికి చెందిన మేడికొండూరు గోపాలకృష్ణ వర్ధంతిని మంగళవారం రాత్రి సహచర బృందం, కుటుంబ సభ్యులు నిర్వహించుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్నికల ప్రచారం మొదలుకొని టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్య క్షుడిగా ఎదిగి మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీఆర్ మన్ననలను పొందిన దివంగత మేడికొండూరు గోపాలకృష్ణ జ్ఞాపకాలు చిరస్మరణీయంగా ఉంటాయని తాళం భజన బృందం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. భజన పాటలను తనదైన శైలిలో రచించటమే కాకుండా తన హావ భావా లతో కూడిన నృత్యాన్ని జోడించి ప్రేక్షకులను ఆనంద పరవశం చేసేవాడని కొని యాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్టేడియం వద్ద ఘర్షణ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టేడియం వద్ద ఇరువురు యువకుల మధ్య ఏర్పడిన ఘర్షణ దాడికి దారితీసింది. స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని ఇండోర్ స్టేడియం వద్ద బుధవారం ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా స్థానికులు అడ్డుకున్నారు. అప్పటికే ఇరువురికి గాయాలు కావడంతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ నేత అడారిని బీజేపీలో చేర్చుకోవడం అనైతికం: కొల్లా

పొన్నూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద్‌కుమార్‌ను బీజేపీలో చేర్చుకోవడం అనైతికమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి బుధవారం అన్నారు. ఆనంద్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో సభా సంఘంను నియమించి విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. అవినీతిపై విచారణ ప్రారంభమైన తరువాత అడారిని బీజేపీలో చేర్చుకోవడం సరికాదన్నారు. మాజీ ప్రధాని, నిజాయితీకి నిలువెత్తు రూపం వాజ్‌పేయి శతజయంతి రోజున ఆరోపణలు ఎదుర్కొంటున్న అడారిఆనంద్‌ను చేర్చుకోవడం అవమానకరమన్నారు. టీడీపీ నిరాకరించిన తర్వాత అతను బీజేపీని ఆశ్రయించారని, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కూడా సభా సంఘంలో ఉన్నారని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం అరాచకానికి పాల్పడి టీడీపీ కార్యకర్తలను వేధించి జైలు పాలుచేసిన వారిని కూడా కూటమి పార్టీలలో చేర్చుకుంటే ప్రజావ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని కొల్లా హెచ్చరించారు.

మనుస్మృతి పత్రాలు దహనం

పొన్నూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో ప్రజా సంఘాలు, కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల నాయకులు మనుస్మృతి పత్రాలను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేద్కర్ మనుస్మృతి పత్రాలను దహనం చేసిన రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు డాక్టర్ టి.రాజారావు, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జీఎస్ రాయల్, ఆకురాతి మురళీకృష్ణ, బలగాని వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, కొప్పుల విజయ్‌కుమార్, గంటా రాజేంద్ర, పెద్దపూడి సుధాకర్, తోడేటి శ్రీనివాస్, మన్నెం కిషోర్, యాతాటి కిషోర్, చిట్టిబాబు పాల్గొన్నారు.


ఊరు పేర్లు తెలిపే బోర్డుకు అల్లుకున్న పిచ్చిమొక్కలు

బోర్డు ఇలా.. తెలిసేదెలా?

తెనాలి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిపాలెం నుంచి కొల్లిపర మండలం మీదుగా వెళ్లే రహదారిపై వచ్చే ఊర్లు ఎన్ని కిలోమీటర్లు ఉన్నది తెలిపే బోర్డులకు పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లేవారికి ఊరి పేర్లు కనిపించడం లేదు. బోర్డుపై ఇలా పిచ్చిమొక్కలతో కప్పి ఉంటే వచ్చే గ్రామాలు ఎంత దూరంలో ఉన్నాయో తెలుసుకోవడం ఎలా అంటూ ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పిచ్చిమొక్కలను తొలగించి బోర్డుపై గ్రామాల పేర్లు కనిపించేలా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదభరితంగా డివైడర్

పొన్నూరుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో భావన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన డివైడర్ ప్రమాదకంగా మారింది. రోజుకు ఒక వాహనమైనా డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురవుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో భావన్నారాయణ స్వామి ఆలయం వద్ద రోడ్డు వెడల్పు చేసి డివైడర్‌ను నిర్మించారు. అయితే డివైడర్ ఎత్తు లేకపోవడం, ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పొన్నూరు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్లే వాహనాలు ఈ డివైడరును ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఈ డివైడరును ఢీకొనడంతో పూర్తిగా ధ్వంసమైంది. వాహనంలోని ప్రయాణీకులు గాయాలపాలయ్యారు. ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్ కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని వాహనదారులు కోరుతున్నారు. బుధవారం కూడా పొన్నూరు పట్టణం నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు డివైడరును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి.


పొన్నూరులో ప్రమాదకరంగా ఉన్న డివైడర్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

● చర్చిలు, రహదారులకు విద్యుత్ దీపాలంకరణ

తెనాలి అర్బన్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం క్రిస్మస్ వేడకలు ఘనంగా జరిగాయి. చర్చిలను, పలు రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలుచోట్ల రంగులతో క్రిస్మస్ అలంకారాలు చేశారు. ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భానుప్రసాద్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఐతానగర్ రక్షణ సైన్యం చర్చిలో థామస్ సియోనుకుమారి సందేశం ఇచ్చారు. బోసురోడ్డులోని టౌన్ చర్చిలో వేకువజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసురత్నం, లెలిన్‌బాబు, సాల్మన్‌రాజు, ప్రకాష్ బాబు క్రైస్తవ కీర్తన ఆరాధన నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ జయప్రకాష్ క్రిస్మస్ సందేశం అందజేశారు. ప్యాడిసన్‌పేటలో సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృపాదానం, ఆనందన్న, జాన్‌వెల్లీ, సంతోషకుమారిలు ప్రసంగించారు. ఎస్టీ కాలనీలో పేదలకు సినీ దర్శకుడు దిలీప్‌రాజా బ్యాగులు, నిరాశ్రయులకు దుస్తులు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇస్లాంపేటలోని ఏసయ్య ప్రార్థనాకొండ చర్చి, ఐతానగర్ క్రీస్తు కృపాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టరుల సర్వోన్నతరావు, సునీల్ బాబు, ప్రకాష్‌బాబు సందేశం ఇచ్చారు. చెంచుపేట నిత్యసహాయ మాత మందిరంలో విన్సెంట్ ఆంటోని, స్లీవయ్య ప్రార్థనలు చేశారు. రూరల్ మండలం పెదరావూరులో తెలుగు బాప్టిస్టు చర్చిలో కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. సంఘ అధ్యక్షుడు చిట్టిబాబు, సువర్ణకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. సండే స్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


ఇమ్మానియేలు చర్చిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్


ప్యాడిసన్‌పేటలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు సుధీర్ తదితరులు


తెనాలిలో క్యాండిల్ ఆరాధన చేస్తున్న పాస్టర్లు


తెనాలిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్లు

పొన్నూరు నియోజకవర్గంలో...

పొన్నూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం పలు మందిరాల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన పాత పొన్నూరులోని క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనపర్తి ఆశీర్వాదం బైబిల్ సందేశం ఇచ్చారు. పట్టణంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చి, క్రీస్తు ఉత్థాన దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. నిడుబ్రోలు లూథరిన్ దేవాలయం, అంబేద్కర్ నగర్‌లోని పలు చర్చిలలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే చేబ్రోలు కొత్తరెడ్డిపాలెంలో యూదు దేవాలయంలో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యూదు జాతీయులు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి తదితర ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.


పొన్నూరులో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం

ఇంటింటికి పెరుగు పంపిణీ

చేబ్రోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజండ్లలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని యువత ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి పెరుగు పంపిణీ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 500 గ్రాముల చొప్పున పెరుగును ఒక్కో ఇంటికి అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి రవిశేఖర్, దాసరి రాజేశ్, సలీమ్, రియాజ్ అలీ, కుమార్ రెడ్డి, నన్న, దాసరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర: మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ పెద్ద ఎత్తున చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, గుడిబండివారిపాలెం, కొల్లిపర, దావులూరు, దావులూరిపాలెం, చింతలపాలెం, అన్నవరం, అన్నవరంలంక, చెముడుబాడు, చివలూరు, సిరిపురం, దంతలూరు, కుంచవరం, అత్తోట గ్రామాల్లో క్రిస్మస్‌ను వైభవంగా నిర్వహించారు.



ఎస్టీలకు బ్యాగులు అందిస్తున్న దిలీప్‌రాజా

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తెనాలి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం అంగలకుదురులో అసెంబ్లీ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఆయన పాలన దోహదపడిందన్నారు. శివాజీచౌక్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి మందా జనార్ధన్, యోగానంద కిషోర్, గాజుల వెంకయ్యనాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, సాంబశివరావు, అనంతాచార్యులు, రఘు, సాయిగుప్తా, వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

ఈదర శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

● వీరవల్లి మురళి


ఈదర శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వీరవల్లిమురళి, నాగభూషణం, రావి చిన్ని తదితరులు

తెనాలి రూరల్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు పేదలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. బుధవారం పట్టణంలో ఈదర శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఈదర శ్రీనివాసరావు నిరంతరం పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్, విద్యార్థినులకు సైకిల్స్, పేదలకు నిత్యావసర సరుకులు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రోగులకు వైద్యసాయంతో పాటు మహిళలకు కుట్టుమిషన్లను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, రావి చిన్ని, షేక్ సలాం, పావులూరి రాంబాబు, ఆలపాటి వెంకటరామయ్య, అలపర్తి శివరామస్వామి, ఈదర పూర్ణచంద్, కన్నెగంటి మురళి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట: నైట్‌షెల్టర్‌లోని పేదలకు రోటరీ క్లబ్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయి సేవాసంఘం నైట్‌షెల్టర్ నందు బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా పేదలకు పండ్లను పంపిణీ చేసి ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కేసన కోటేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ హెల్త్ అండ్ ఐజనిక్ చైర్మన్ డాక్టర్ ధూళిపాళ్ల రవీందర్‌నాథ్, జీవీ నారాయణ, ఆలపాటి కిరణ్, కిషోర్, సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి క్రీడాకారులు ప్రతిభ చూపారు. విజయవాడలో ఈ నెల 22, 23వ తేదీల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించారు. పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 76కిలోల విభాగంలో బొల్లు లిఖిత 227కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది. 84కిలోల విభాగంలో ఏలూరి లక్ష్మి గోల్డ్‌మెడల్‌తో పాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ కైవసం చేసుకుంది. 74కిలోల విభాగంలో మణిచంద్ వెండి పతకాన్ని సాధించారు. పట్టణంలోని క్విక్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులను బుధవారం కోచ్ ఘట్టమనేని సాయిరేవతి, శివరామకిరణ్, భార్గవ్ తదితరులు అభినందించారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

కీళ్లనొప్పులకు జాగ్రత్తలు పాటించాలి

● ఆర్థోపెడిక్ వైద్యుడు రాకేష్

ఫటా ఫట్



తెనాలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారు చలికాలం తగిన జాగ్రత్తలు పాటించకుంటే కీళ్ల నొప్పులు పెరిగే అవకాశం ఉందని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ తలశిల రాకేష్ చెప్పారు. చలికాలం కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు పలు జాగ్రత్తలను ఆంధ్రజ్యోతికి బుధవారం వివరించారు..

ప్రశ్న: చలికాలంలో కీళ్ల నొప్పులు ఎందుకు పెరుగుతాయి?

జవాబు: చలికాలంలో కీళ్ల నొప్పులు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శరీరానికి అవసరమైన సూర్యరశ్మి (విటమిన్ డి) తగినంతగా అందకపోవడంతో ఈ సమస్యలు ఏర్పడతాయి. అవేకాకుండా తీవ్రమైన చలి వల్ల రక్తనాళాలు కాస్త కుంచించుకుని రక్తప్రసరణ మెరుగ్గా ఉండదు. వివిధ భాగాలకు రక్తప్రసరణ సరిగా ఉండక చాలామందిలో నొప్పులు పెరుగుతుంటాయి. శరీరానికి అవసరమైన నీరు తాగకపోవడం వల్ల కూడా డీహైడ్రేషన్‌తో కీళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: కీళ్ల నొప్పులబారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

జ: చలికాలం కీళ్ల నొప్పులబారిన పడకుండా ఉండేందుకు శరీరం చలిని తట్టుకుని వేడిపుట్టేలా కోట్లు, మంకీక్యాప్‌లు, ఇంట్లో వేడిగా ఉండేలా హీటర్లు, వేడినీటి బ్యాగ్‌లతో నొప్పి ప్రాంతంలో ఉంచడం, వేడినీటి స్నానం చేయడం వంటివి చేయాలి. వీటి ద్వారా శరీరానికి ఎటువంటి హాని కలగదు.

ప్రశ్న: వ్యాయామం ద్వారా కీళ్ల నొప్పులు తగ్గుతాయా?

జ: శరీరంలో కీళ్లు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కీళ్ల నొప్పులకు స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చాలా మేలు చేస్తాయి. ఎక్కువ నడవడం వల్ల కీళ్లకు మంచి వ్యాయామం అవుతుంది.

ప్రశ్న: అధిక బరువు ఉన్న వారిలో కీళ్లనొప్పులు వస్తాయంటారు. ఇదినిజమేనా?

జ: అందరిలో వస్తాయన్నదాంట్లో వాస్తవం లేదు. కాని అధిక బరువు కీళ్లపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. దీనివల్ల నొప్పి కలుగుతుంది. బరువు పెరగకుండా జాగ్రత్తపడాలి. ఆరోగ్యకరమైన ఆహారం తింటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే సమస్య రాకుండా ఉంటుంది.

స్వాతంత్ర్య సమరయోధురాలు తులశమ్మకు ఘన నివాళి


స్వాతంత్ర సమరయోధురాలు తులశమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీడీసీసీబీ మాజీ చైర్మన్ సీతారామయ్య, తిమ్మానాయుడు, సురేంద్ర తదితరులు

తెనాలి మారీసుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ శ్రేయోభిలాషి దివంగత కల్లూరి తులశమ్మ 114వ జయంతిని ఘనగా నిర్వహించారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో బుధవారం శాఖమూరి తిమ్మానాయుడు ఆధ్వర్యంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య పలువురు గ్రామ పెద్దలు పాల్గొని తులశమ్మ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలడుగు సురేంద్ర, కొడాలి పూర్ణచంద్రరావు, రాంబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వైసీపీ ఫ్లెక్సీ


శలపాడు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కట్టిన జగన్ ఫ్లెక్సీ

చేబ్రోలు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన వైసీపీ పోస్టర్ గ్రామస్తులను విస్మయానికి గురిచేస్తున్నది. ఇటీవల మాజీ సీఎం జగన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు జగన్ ఫ్లెక్సీని నిబంధనలకు విరుద్ధంగా శలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. పుట్టిన రోజు వేడుకలు పూర్తియినప్పటికీ గత వారం రోజులుగా ఈ ఫ్లెక్సీ తొలగించకుండా ఉంచారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద రాజకీయ పార్టీల ఫ్లెక్సీ ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికి వైసీపీ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు విస్మయానికి గురవుతున్నారు. ఇది ఏర్పాటుచేసి వారం రోజులు అవుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు కానీ, విద్యాశాఖ అధికారులు కానీ ఫ్లెక్సీ తొలగించకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పైర్ల వ్యర్థాలు తగలబెడితే నిస్సారంగా భూమి

● పాడి రైతులకు పొంచివున్న పశుగ్రాసం కొరత
● వరి వ్యర్థాలను రోటావేటర్ ద్వారా భూమిలో కలయదున్నాలి
● ఎండుగడ్డిని అమ్ముకుంటే ఆదాయం

తెనాలి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకాలం పూర్తి కావస్తుండటంతో చేతికొచ్చిన వరిపైర్లను హార్వెస్టర్లతో రైతులు కోతలు కోయించి ధాన్యాన్ని సేకరిస్తూ ఎండుగడ్డిని వదిలేస్తున్నారు. గతంలో వరిపైర్లను కూలీలతో కోయించి కుప్పలుగా వేసి రబీ ముగిసిన తరువాత నూర్పిడులు చేయించేవారు. అందులో వచ్చిన ధాన్యాన్ని గోతాల్లో నింపుకుని ఇంటికి తరలించి వచ్చిన ఎండుగడ్డిని కట్టలు కట్టి పశుపోషకులకు విక్రయించుకునే వారు. కాలక్రమేణా ఆ విధానాన్ని రైతులు ఆచరించడం లేదు. అందుకు సమయం వెచ్చించడంతోపాటు కూలీల ఖర్చు కూడా పెరుగుతుండటంతో అందుబాటులోకి వచ్చిన హార్వెస్టర్ యంత్రాల వైపే అధికసంఖ్యలో రైతులు మొగ్గు చూపుతున్నారు. వీటి ద్వారా కోతలు కోయించడంతో ధాన్యాన్ని వెంటనే సేకరించుకుని రోజుల వ్యవధిలోనే అమ్ముకునే అవకాశం ఉండటంతోపాటు కూలీల ఖర్చు తగ్గుతోంది. యంత్రాలతో కోతల అనంతరం వచ్చిన వరిగడ్డి వ్యర్థాలను కూలీలతో పోగుచేయిస్తే వారికి ఎంతోకొంత వెచ్చించాల్సి వస్తుందని ఆ వ్యర్థాలను పంటభూముల్లోనే నిప్పుపెట్టి తగలబెడుతున్నారు. ఇలా చేయడం ద్వారా పంటభూముల్లో సేంద్రియ శాతం తగ్గి భూములు సారాన్ని కోల్పోతున్నాయి. తద్వారా రైతులకు నష్టం కలిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూమిలో ఉన్న సూక్ష్మపోషకాలు, మేలు చేసే బ్యాక్టీరియా, మిత్రపురుగులు నశించి భూమి సారం కోల్పోయి రానురాను పంటలు ఎదుగుదల దెబ్బతిని చీడపీడలు సోకి దిగుబడులు తగ్గే ప్రమాదం పొంచి ఉంది. దీని ప్రభావం పాడిరైతులపై కూడా పడి పశుగ్రాసంగా వినియోగించే ఎండుగడ్డి కొరత ఏర్పడి పశువుల పెంపకం ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది.

పంట భూముల్లో వచ్చిన ఎండుగడ్డిని కట్టలు కట్టిస్తే మేలు

హార్వెస్టర్లతో ధాన్యం సేకరించిన అనంతరం వచ్చిన ఎండుగడ్డిని యంత్రాల సాయంతో కట్టలు కట్టిస్తే ఎంతో కొంత ఆదాయం గడించే అవకాశం రైతులకు ఉంటుంది. పాడి పశువుల పోషణకు ఎండుగడ్డి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆ కట్టలను పశుపోషకులకు విక్రయించుకుంటే ఎంతో కొంత ఆదాయం గడించడంతోపాటు పాడి రైతులకు ఆసరాగా నిలిచిన వారవుతారు.

భూమిలో రోటావేటర్‌తో కలయదున్నడం ద్వారా పెరగనున్న భూసారం

ఎండుగడ్డి వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా పంట భూముల్లో రోటావేటర్‌తో కలియదున్నడం చేస్తే భూమిలోకి కలిసిపోయి అవి కుళ్లి ఎరువుగా మారి సారవంతమైన పంటభూములుగా మారతాయి. తదుపరి వేసే పంటలకు ఎరువులు తగ్గించుకుని దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. ఇకనైనా రైతులు వరి పైర్లలో వ్యర్థాలను తగలబెట్టకుండా సద్వినియోగం చేసుకోవడం మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.


పంటభూముల్లో వ్యర్థాలు తగలబెడుతున్న దృశ్యం